SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక



epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565



సంపుటి: 19 | సంచిక: 291 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శుక్రవారం 11 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |


## హైవే జాప్యంపై సిగ్గుపడుతున్నా.. ప్రారంభోత్సవానికి రాను!

ముంబై-గోవా పనులపై గడ్కరీ అసహనం

నాసిరకం పనులు సహించేది లేదని హెచ్చరిక



ముంబై-గోవా హైవే విస్తరణ పనుల్లో తీవ్ర జాప్యంపై కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు ఇంత ఆలస్యం కావడం పట్ల తాను సిగ్గుపడుతున్నానని వ్యాఖ్యానించారు. అందుకే ఆ రహదారి ప్రారంభోత్సవానికి తాను హాజరుకాబోనని ముందుగానే ప్రకటించారు. 4



## నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

- దుష్ప్రచారాలు నమ్మొద్దు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి

వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. 2

## ఆర్టీసీ బస్సు బీభత్సం

- పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన బస్సు
- బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి..
- రెండు కార్లు, ఆటో ధ్వంసం
- డీజిల్ పంపును ఢీకొట్టడంతో కలకలం




2



## త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు

- మెట్రోతో మరో 50 బస్సులు అనుసంధానిస్తాం
- పీఎం ఈడ్రైవ్ కింద నగరానికి 2,200 బస్సులు
- తెలంగాణలో కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చాం
- రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి 2

# ఫామ్‌హౌస్‌లోనే సభపై కుట్ర



- మూడు రోజులు సభను సాగనివ్వలేదని ఆరోపణ
- ప్రజాప్రతినిధులు, అధికారులను దూషించారని విమర్శ
- దళితులు నడిచిన నేలను శుద్ధి చేశారని మండిపాటు
- వరుస ఘటనలపై విచారణ చేపట్టామన్న సీఎం
- సీఎల్పీ భేటీలో ఎమ్మెల్యేలకు రేవంత్ దిశానిర్దేశం

**ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన సమావేశమై, శాసనసభను సజావుగా సాగనివ్వకుండా కుట్ర పన్నిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. గురువారం నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశంలో సీఎం ప్రసంగించారు. ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడమే సభ నిర్వహణ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అయితే, అధికారం పోయినా అహంకారం వీడని బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులను, పోలీసు అధికారులను దూషిస్తూ వరుసగా మూడు రోజుల పాటు సభను అడ్డుకున్నారని విమర్శించారు.**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):** ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్.. కేసీఆర్ అధ్యక్షతన ఫామ్‌హౌస్‌లో సమావేశమై అసెంబ్లీని సజావుగా జరగనివ్వకుండా కుట్ర చేసిందని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడమే అసెంబ్లీ సమావేశాల ప్రధాన లక్ష్యమని చెప్పారు. అయితే అధికారం కోల్పోయినా అహంకారం వీడని బీఆర్ఎస్ నేతలు మూడు రోజుల పాటు సభ సజావుగా సాగకుండా అడ్డుకున్నారని విమర్శించారు. గురువారం జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధుల ను దూషించడంతో పాటు అధికారుల

మిగతా 2 లో



## కొండల్‌రెడ్డికి రూ.200 కోట్ల భూమి కట్టబెట్టారు

- నిబంధనలకు విరుద్ధంగా ఐదెకరాల కేటాయింపు: కేటీఆర్
- ప్రశ్నించినందుకే ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారని ఆరోపణ
- బినామీ కంపెనీల కోసమే సీఎం పనిచేస్తున్నారని విమర్శ
- సమగ్ర విచారణకు ఈడీ, సీబీఐ, ఐటీని రంగంలోకి దించాలని డిమాండ్
- ఫ్యూచర్ సిటీ భూముల పరిశీలన.. తుక్కుగూడలో బీఆర్ఎస్ నిరసన

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సోదరుడు కొండల్‌రెడ్డికి చెందినదిగా ఆరోపిస్తున్న షెల్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కట్టబెట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ భూకేటాయింపును అసెంబ్లీ వేదికగా ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వరుసగా సస్పెండ్ చేశారని ధ్వజమెత్తారు. ఫ్యూచర్ సిటీలో టెస్సరాక్ట్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన భూములను గురువారం హరీశ్‌రావు, ఇతర బీఆర్ఎస్ నేతలతో కలిసి కేటీఆర్ పరిశీలించారు. 2




## ఫ్లాష్ సర్వేలో బీఆర్ఎస్ గ్రాఫ్ డౌన్!



- మూడు రోజుల పరిణామాలపై సర్వే చేయించామన్న సీఎం
- ప్రభుత్వంపై వ్యతిరేకత లేదని వెల్లడి
- బీఆర్ఎస్ తీరునే ప్రజలు తప్పుబట్టారని వ్యాఖ్య

రాష్ట్రంలో గత 3 రోజులుగా చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలపై ప్రభుత్వం ఫ్లాష్ సర్వే నిర్వహించిందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనల విషయంలో ప్రభుత్వంపై వ్యతిరేకత కంటే బీఆర్ఎస్ నేతల వ్యవహారశైలినే ప్రజలు ఎక్కువగా తప్పుబట్టారని సర్వేలో తేలినట్లు పేర్కొన్నారు. 2

## ఢిల్లీలో బ్రిక్స్ మహాసదస్సు

- 12, 13 తేదీల్లో భారత్ మండపం వేదిక
- పుతిన్, జిన్‌పింగ్ సహా అగ్రనేతల రాక
- నాలుగోసారి బ్రిక్స్‌కు భారత్ అధ్యక్షత




.. వివరాలు 4లో

## మోదీతో ప్రిన్స్ రహీమ్ ఖాన్ భేటీ

- అభివృద్ధి భాగస్వామ్యంపై కీలక చర్చ
- ఆరోగ్యం.. వ్యవసాయం.. గ్రామీణాభివృద్ధిపై దృష్టి
- మహిళలు, యువత సాధికారతకు ప్రాధాన్యం
- ఇమామ్‌గా బాధ్యతల తర్వాత తొలి భారత పర్యటన

4



## బాలికను బెదిరిస్తే సహించం

- బాధితురాలి భద్రతపై సుప్రీంకోర్టు సీరియస్
- సీజేపీ నిరసనల్లో పాల్గొన్న బాలిక కేసుపై విచారణ
- స్వతంత్ర భరద్వాజ్‌పై వేధింపులు, అదనపు సెక్షన్లు

4





# త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు

**మెట్రోతో మరో 50 బస్సులు అనుసంధానిస్తాం**

**పీఎం ఈడ్రైవ్ కింద నగరానికి 2,200 బస్సులు**

**తెలంగాణలో కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చాం**

**రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):** గత ప్రభుత్వం హయాంలో ఆర్టీసీ మూసివేసే పరిస్థితి ఉండగా ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందని రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం సమాధానాలిచ్చారు. పీఎం ఈడ్రైవ్ కింద హైదరాబాద్ నగరానికి 2,200 బస్సులు రాబోతున్నాయని తెలిపారు. ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికల)కు గత ప్రభుత్వం రద్దు చేసిందన్న మంత్రి, త్వరలో ఎన్నికల తేదీపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చాం. హైదరాబాద్ నగరానికి 100 మినీ బస్సులు రాబోతున్నాయి. వాటిలో 50 పాతబస్తీకి, మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానిస్తాం. 347.47 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం పొందగలిగారు. ఇది ఒక చరిత్ర అని తెలిపారు. ఆర్టీసీ ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాత కొత్త బస్టాండ్లు నిర్మిస్తాం. వంద మినీ బస్సులు రాబోతున్నాయి. పాతబస్తీకి 50 కేటాయిస్తాం. మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానం చేస్తాం. బస్టాండ్ల అభివృద్ధికి ఆర్థికంగా ఎమ్మెల్యేలు సహకరించాలి. 347.47కోట్ల మంది మహిళలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారు. మహిళలు రూ.12,171 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం చేశారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఆర్టీసీ స్థలం అందించాం. కార్మిక సంఘాల ఎన్నికలను గత ప్రభుత్వం రద్దు చేసింది. కార్మిక సంఘాల ఎన్నికలపై సంఘాల నేతలతో చర్చలు జరుగుతున్నాయి. కార్మిక సంఘాల ఎన్నికల తర్వాత ఆర్టీసీ వీలీన ప్రక్రియ ఉంటుంది. ఆర్టీసీ విలీనమైన ఏపీలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

# ఆర్టీసీ బస్సు బీభత్సం..

**పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన బస్సు**

**ఘటనలో రెండు కార్లు, ఆటో ధ్వంసం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):** హైదరాబాద్ శివారులో ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన ఘటన కలకలం రేపింది. అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని బాటసింగారం వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపై వెళ్తున్న బైక్‌ను తప్పించేందుకు ప్రయత్నించిన సమయంలో ఆర్టీసీ అద్దె బస్సు నియంత్రణ కోల్పోయినట్లు సమాచారం. ఆ తర్వాత రోడ్డు పక్కనే ఉన్న పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన బస్సు అక్కడ నిలిపి ఉన్న వాహనాలను ఢీకొట్టింది. బస్సు బంకులోకి వెళ్లే క్రమంలో రెండు కార్లు, ఓ ఆటోను ఢీకొట్టింది. అంతేకాకుండా డీజిల్ పంపునకు కూడా బస్సు ఢీకొనడంతో బంకు పరిసరాల్లో ఒక్కసారిగా భయానక పరిస్థితి నెలకొంది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో పెట్రోల్ బంకు వద్ద పెద్దగా జనసంచారం లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నప్పటికీ అదృష్టవశాత్తూ పెను ముప్పు తప్పింది. బస్సు అదుపుతప్పి బంకులోకి దూసుకెళ్లిన మొత్తం ఘటన అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డైంది. ప్రస్తుతం ఈ దృశ్యాలు బయటకు రావడంతో ప్రమాదం ఎలా జరిగిందనే విషయం స్పష్టంగా కనిపిస్తోంది. బైక్‌ను తప్పించబోయే సమయంలోనే బస్సు డ్రైవర్ నియంత్రణ కోల్పోయినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్నది ఇంకా పూర్తిగా నిర్ధారణ కాలేదు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బస్సు డ్రైవర్ పరిస్థితి, ప్రమాద సమయంలో వాహనం వేగం, ఇతర సాంకేతిక కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణాల్లో విచారణ చేస్తున్నారు. సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలిస్తూ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్–-విజయవాడ జాతీయ రహదారిపై సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పరిధిలో మరో రోడ్డు ప్రమాదం జరిగింది. దుర్గాపురం స్టేజ్ సమీపంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు లారీల క్యాబిన్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అయితే అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

# నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

**హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):** హైదరాబాద్ మహానగరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తాము పునరుద్ధరణ పనులు చేపడుతున్న చెరువుల వద్ద నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు విధించలేదని ఆయన ఫుల్ క్లారిటీ ఇచ్చారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫై చేసిన నాలుగైదు సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా బయో డైవర్సిటీగా గుర్తించిన అమీన్‌పూర్ చెరువు, నేచురల్ వెట్‌ల్యాండ్‌గా రక్షణ పొందిన కాప్రా చెరువులు ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు. కాప్రా చెరువులో ప్రస్తుతం నీరు లేనందున అక్కడ ఎవరూ సమస్యలు సృష్టించవద్దని కోరారు. నగరంలోని మిగిలిన అన్ని చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు ఎప్పటిలాగే యథావిధిగా సాగుతాయని స్పష్టం చేశారు. ప్రధాన నీటి వనరులు, చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు, భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విస్తృతంగా 'బేబీ పాండ్స్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైడ్రా సుందరీకరిస్తున్న చెరువుల వద్ద ఎటువంటి నిషేధాలు లేవని, వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణ హితంగా నిర్వహించుకునేలా భాగ్యనగర ప్రజలు, ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాలని కోరారు.

# 'సభను అడ్డుకునేందుకు ఫామ్‌హౌస్‌లోనే కుట్ర'

మొదటి పేజీ తరువాయి

పట్ల అనుచితంగా వ్యవహరించారని ఆరోపించారు. మహిళా అధికారుల ఎదుట టీషర్టులు విప్పి ఇబ్బందికరంగా ప్రవర్తించారని, శాసనసభాపతిపై అత్యంత అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. నిరసన తెలిపేందుకు కాంగ్రెస్ ఎస్సీ సెల్ కార్యక్రమం చేపడితే.. దళితులు నడిచిన నేలను శుద్ధి చేసి అవమానించారని సీఎం ఆరోపించారు. ప్రతిపక్ష కుట్రను బలంగా తిప్పికొట్టి, ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజలకు తెలియజేసిన కాంగ్రెస్ సభ్యులను అభినందిస్తున్నట్లు తెలిపారు. గత మూడు రోజులుగా చోటుచేసుకున్న సంఘటనలపై విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తప్పనిసరిగా సభలో జరిగే చర్చల్లో పాల్గొనాలని రేవంత్‌రెడ్డి సూచించారు. అసెంబ్లీ జరిగినన్ని రోజులు సభ్యుల హాజరు సంపూర్ణంగా ఉండాలని స్పష్టం చేశారు. తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సభలో ప్రస్తావించాలని చెప్పారు. ప్రజలు ఇచ్చిన హోదాను సక్రమంగా ఉపయోగించుకోకపోతే భవిష్యత్తులో రాజకీయంగా రాణించడం కష్టమని హెచ్చరించారు. సభ్యులందరికీ వెసులుబాటుగా ఉండాలనే ఉద్దేశంతో చారిత్రక భవనంలో శాసనమండలిని నిర్వహిస్తున్నామని తెలిపారు. అసెంబ్లీలో సెంట్రల్ హాల్‌ను ప్రారంభించి దానికి దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టుకున్న విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎదిగిన నేతలే ఇప్పుడు కాంగ్రెస్‌కు నష్టం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీతా



లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. పోలీసు సిబ్బందిలో కేటీఆర్‌కు రేవంత్‌రెడ్డి కనిపించినట్లున్నారని, అందుకే అంత ఆక్రోశంతో అధికారులపై దాడులకు పాల్పడ్డారని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇది తెలంగాణ సాధించిన ఘనత అని చెప్పారు. తెలంగాణ నమూనాలోనే దేశవ్యాప్తంగా జనగణనలో కులగణన చేపట్టేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పార్టీ నేతలకు సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పేరుతో ఓట్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని సీఎం ఆరోపించారు. ఎమ్మెల్యేగా మరోసారి గెలవాలనుకునే ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కాపాడే అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. నేతల ప్రతి చర్య, వ్యక్తిగత పనితీరు రెండోసారి గెలుపోటములపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా తేలితే.. ఓటర్ల జాబితాలో మాత్రం 88 కోట్ల మందే ఉన్నారని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. "దేశంలో 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయి. ఎక్కడో ఏదో ప్రమాదం పొంచి ఉంది" అని వ్యాఖ్యానించారు. ఓటర్ల జాబితా సవరణ అంశాన్ని పార్టీ ఎమ్మెల్యేలు అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకునేందుకు సహకరించిన ఎమ్మెల్యేలకు రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సభ్యుల సహకారంతో దేశంలో మరెక్కడా లేని విధంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తీసుకొచ్చామని గుర్తుచేశారు. వాటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు.

# ఫ్లాష్ సర్వేలో బీఆర్ఎస్ గ్రాఫ్ డౌన్!

**మూడు రోజుల పరిణామాలపై సర్వే చేయించామన్న సీఎం**

**ప్రభుత్వంపై వ్యతిరేకత లేదని వెల్లడి**

**బీఆర్ఎస్ తీరునే ప్రజలు తప్పుబట్టారని వ్యాఖ్య**

**'హరీశ్ భూముల చిట్టా బయటపెడతాం'**



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):** రాష్ట్రంలో గత మూడు రోజులుగా చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలపై ప్రభుత్వం ఫ్లాష్ సర్వే నిర్వహించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనల విషయంలో ప్రభుత్వంపై వ్యతిరేకత కంటే బీఆర్ఎస్ నేతల వ్యవహారశైలినే ప్రజలు ఎక్కువగా తప్పుబట్టారని సర్వేలో తేలినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ గ్రాఫ్ భారీగా పడిపోయిందని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. ఇటీవల అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న పరిణామాలు, ప్రతిపక్ష బీఆర్ఎస్ వ్యవహారశైలి, ప్రభుత్వ భవిష్యత్ వ్యూహంతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేల పనితీరుపై సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు సమాచారం.

**మూడు రోజుల పరిణామాలపై సర్వే**

సెప్టెంబర్ 7న అసెంబ్లీ గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై చేసినట్లు చెబుతున్న అభ్యంతరకర వ్యాఖ్యలు, ఎర్రవల్లిలో జరిగిన శుద్ధీకరణ కార్యక్రమం తదితర అంశాలను సీఎం ప్రస్తావించినట్లు తెలిసింది. ఈ పరిణామాలపై నిర్వహించిన ఫ్లాష్ సర్వేలో ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత కనిపించలేదని, బీఆర్ఎస్ నేతల తీరుపైనే ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమైనట్లు రేవంత్‌రెడ్డి చెప్పినట్లు సమాచారం. ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. అయితే ప్రధాన ప్రతిపక్షం సభను సజావుగా సాగనివ్వకుండా కుట్ర చేసిందని ఆరోపించారు.

**'ఓటు హక్కును కాపాడాలి'**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ఓట్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్యేగా గెలవాలనుకునే ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కాపాడే అంశాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని పార్టీ నేతలకు సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

**'హరీశ్ భూముల చిట్టా బయటపెడతాం'**

22ఏ భూముల అంశంలో ప్రతిపక్షం తప్పుడు ప్రచారం చేస్తోందని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. ధరణి వ్యవస్థలో హరీశ్‌రావు రాయించుకున్నట్లు ఆరోపిస్తున్న భూముల వివరాలను బయటపెడతామని ప్రకటించారు. బీఆర్ఎస్ నేతలకు సంబంధించిన పూర్తి చిట్టా సిద్ధంగా ఉందని పేర్కొన్నట్లు సమాచారం. అసెంబ్లీ పరిణామాలను రాజకీయంగా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ వెయ్యి రోజుల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

# పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**రూ.5 లక్షల ఉచిత సాయం.. దేశంలోనే ఎక్కడాలేని విధంగా తెలంగాణలో అమలు**

**రెండో విడతలో 59 వేల గుడిసెల స్థానంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం**

**హైదరాబాద్‌లో బోనాల పండుగ నాటికి 'ఇందిరమ్మ టవర్స్' గృహప్రవేశాలు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):** పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నదే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గురువారం శాసనసభలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమగ్ర సమాధానమిచ్చారు. పేదలను వారి జీవనోపాధికి దూరంగా 30 నుంచి 40 కిలోమీటర్ల అవతలికి పంపించే విధానం తమ ప్రభుత్వానికి లేదని తేల్చిచెప్పారు. ఎకరం రూ.150 నుంచి రూ.200 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లో సైతం పేదవాడి ఆత్మగౌరవానికి తగినట్లుగా ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఎంపిక విధానంలో డ్రా ద్వారా పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని, అర్హులైన పేదలకు పార్టీలకు అతీతంగా ఇళ్లు కేటాయిస్తున్నామని వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణలోనే పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఉచిత ఆర్థిక సాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లకు రూ.22,500 కోట్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లకు రూ.11 వేల కోట్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లకు రూ.5,500 కోట్లు చొప్పున.. మొత్తం 8 లక్షల ఇళ్లకు ప్రభుత్వంపై రూ.40 వేల కోట్లకు పైగా భారం పడుతున్నా వెనకడుగు వేసేది లేదన్నారు. రాబోయే రోజుల్లో మూడో, నాలుగో విడతల్లోనూ ఇళ్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను విస్తరిస్తామని చెప్పారు. దశాబ్దాలుగా గుడిసెల్లో నివసిస్తున్న పేదల కోసం రెండో విడతలో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ 59 వేల గుడిసెల స్థానంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించనున్నట్లు ప్రకటన చేశారు. అలాగే హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్న 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణ పనులను వేగవంతం చేసి, వచ్చే ఏడాది బోనాల పండుగ నాటికి గృహప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇంటి నిర్మాణ వ్యయాన్ని తగ్గించేందుకు వీలుగా లబ్ధిదారులకు రాయితీ ధరలకే సిమెంట్, స్టీల్ అందించేందుకు ఒప్పందాలు చేసుకున్నామని మంత్రి తెలిపారు. మార్కెట్‌లో రూ.310–320 ఉన్న 50 కేజీల సిమెంట్ బస్తాను రూ.230కే అందించేలా కంపెనీలతో ఒప్పందం పూర్తయిందని వెల్లడించారు. ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేని డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు రూ.లక్ష ముందస్తుగా అడ్వాన్స్‌గా అందించే వెసులుబాటు కూడా కల్పించామన్నారు. గతంలో అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్లను పూర్తి చేసేందుకు రూ.600 కోట్లు ఖర్చు చేయడమే కాకుండా, పాత బకాయిల కోసం రూ.750 కోట్ల బిల్లులు చెల్లించామని సభకు తెలిపారు. రెండో విడతలో ప్రతి 2,000 ఇళ్లలో 500 ఇళ్లను అసంపూర్తిగా ఉన్న పాత ఇళ్లకు కేటాయించే కొత్త విధానాన్ని తీసుకొచ్చామని, అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని పొంగులేటి శ్రీనివాసరెడ్డి

# హైదరాబాద్‌లో బుల్లెట్ ట్రైన్ హబ్

**796.28 ఎకరాల సేకరణకు ప్రాథమిక నోటిఫికేషన్**

**శంషాబాద్ సమీపంలో సమీకృత రవాణా కేంద్రం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):** తెలంగాణ రవాణా రంగాన్ని ప్రగతి పథంలోకి తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా శ్రీకారం చుట్టిన ప్రతిష్ఠాత్మక బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు తొలి అడుగు పడింది. హైదరాబాద్‌ను దేశంలోనే ప్రముఖ హైస్పీడ్ రైలు కనెక్టివిటీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో 'ఇంటిగ్రేటెడ్ మొబిలిటీ హబ్' (సమీకృత సమగ్ర రవాణా కేంద్రం) ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియను రెవెన్యూ అధికారులు అధికారికంగా ప్రారంభించారు. శంషాబాద్–తుక్కుగూడ ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డును ఆనుకుని ఉన్న బహదూర్‌గూడ వద్ద 796.28 ఎకరాల భూమిని సేకరించేందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ స్థలంలో 750 ఎకరాల ప్రభుత్వ భూమి, 46.28 ఎకరాల ప్రైవేటు పట్టా భూములు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నోటిఫికేషన్ వెలువడిన దృష్ట్యా కలెక్టర్ ముందస్తు అనుమతి లేకుండా సదరు భూముల్లో ఎలాంటి లావాదేవీలు లేదా అభివృద్ధి పనులు చేపట్టకూడదని రెవెన్యూ శాఖ స్పష్టం చేసింది. ఈ నోటిఫికేషన్‌పై ఏవైనా అభ్యంతరాలు ఉంటే 60 రోజుల్లోగా లిఖితపూర్వకంగా తెలపాలని సూచించారు. విమానాశ్రయ రన్‌వేకు అత్యంత సమీపంలో ఈ హబ్‌ను నిర్మించడం వల్ల విమాన ప్రయాణికులు నేరుగా బుల్లెట్ రైలు సేవలను వినియోగించుకోవడానికి వీలుకలుగుతుంది. బహదూర్‌గూడ కేంద్రీకృతంగా హైదరాబాద్–ముంబయి, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై (వయా అమరావతి) మార్గాల్లో మూడు ప్రధాన హైస్పీడ్ కారిడార్లు రూపుదిద్దుకోనుండగా, ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే ఆయా నగరాలకు ప్రయాణ సమయం కేవలం 2 గంటలకు తగ్గిపోనుంది.

# కొండల్‌రెడ్డికి రూ.200 కోట్ల భూమి కట్టబెట్టారు

- నిబంధనలకు విరుద్ధంగా ఐదెకరాల కేటాయింపు: కేటీఆర్
- ప్రశ్నించినందుకే ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారని ఆరోపణ
- బినామీ కంపెనీల కోసమే సీఎం పనిచేస్తున్నారని విమర్శ
- సమగ్ర విచారణకు ఈడీ, సీబీఐ, ఐటీని రంగంలోకి దించాలని డిమాండ్
- ఫ్యూచర్ సిటీ భూముల పరిశీలన.. తుక్కుగూడలో బీఆర్ఎస్ నిరసన



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోదరుడు కొండల్ రెడ్డికి చెందిన షెల్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ. 200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కట్టబెట్టారని, ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వరుసగా సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. టెస్సరాక్ట్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన భూములను పరిశీలించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్ రావు నేతృత్వంలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం క్షేత్రస్థాయికి చేరుకుంది. కొండల్ రెడ్డికి అనుకూలంగా ప్రభుత్వం ఈ భూములను కట్టబెట్టిందని ప్రధానంగా ఆరోపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, వివాదాస్పద భూములను స్వయంగా పరిశీలించేందుకు తుక్కుగూడ పరిసర ప్రాంతాలకు భారీ కాన్వాయ్‌తో చేరుకోవడంతో ఒక్కసారిగా అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ పరిశీలన పర్యటనలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు. చేతుల్లో ప్లకార్డులు, భారీ బ్యానర్లు పట్టుకుని నేతలు ఆందోళన నిర్వహించారు. ప్రజాధనంతో ముడిపడి ఉన్న విలువైన ప్రభుత్వ భూములను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై వారు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ సంఘటనా స్థలంలో నిరసన చేపట్టారు. ఈ భూముల అంశం అసెంబ్లీలోనూ తీవ్ర గందరగోళానికి దారితీసింది. సభలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నంలో భాగంగా పోడియం వద్దకు దూసుకెళ్లిన బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలను ఖండిస్తూ పోడియం వద్ద పేపర్లు చింపి పైకి ఎగురవేయడంతో సభలో గందరగోళం తలెత్తింది. సభ్యుల ఆందోళన అదుపు తప్పడంతో స్పీకర్/చైర్మన్ జోక్యం చేసుకుని, సభా మర్యాదలను కాపాడేందుకు మార్షల్స్‌ను రంగంలోకి దించాలని ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీలో నిరసనల అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన కోసం కేటీఆర్, హరీశ్ రావు నేతృత్వంలోని ఎమ్మెల్యేలు తుక్కుగూడలోని టెస్సరాక్ట్ సైట్‌కు చేరుకోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు పేరుతో జరుగుతున్న భూకేటాయింపులపై పూర్తిస్థాయి వాస్తవాలను ప్రజల ముందుకు తెస్తామని, ఈ అంశంపై న్యాయపరమైన, ప్రజా పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. నాయకుల రాకతో స్థానిక పరిసరాల్లో భారీగా మోహరించిన పోలీసులు శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. పర్యవేక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని నిత్యం చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, ఆ సమయాన్నంతా తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కాకుండా తన సొంత సోదరులు, బినామీ షెల్ కంపెనీల లబ్ధి కోసమే కేటాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేవలం రూ. లక్ష మూలధనంతో నడిచే కంపెనీకి ఐదెకరాల విలువైన భూమిని ఎలా కేటాయిస్తారని కేటీఆర్ నిలదీశారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎవరైనా కేవలం లక్ష రూపాయలతో స్టార్టప్ పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే వందల కోట్ల విలువైన భూములు ఇస్తుందా..? అని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇజ్రాయెల్ వ్యాపార భాగస్వామ్యాలపై ప్రధాని మోదీని ప్రశ్నిస్తుంటే, ఇక్కడ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రేవంత్ రెడ్డి సోదరుడి కోసం 'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్' సంస్థతో ఒప్పందాలు కుదుర్చుకుని ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ల పేరుతో భూములు కొల్లగొడుతోందని ఆరోపించారు. నెలకు రూ. 4,000 పింఛన్, మహిళలకు రూ. 2,500, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలకు మొండిచేయి చూపించిన కాంగ్రెస్, సీఎం సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి, వందల కోట్ల ఆస్తులు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. ఈ భారీ భూ కుంభకోణంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే తక్షణమే ప్రవర్తన, పత్రాలపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లి సమీపంలోనే రైతులు కరెంట్ కోసం రోడ్డెక్కడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనమనిమాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లి సమీపంలోని శ్రీశైలం--హైదరాబాద్ జాతీయ రహదారిపై రైతులు మెరుపు ధర్నాకు దిగడం, ట్రాక్టర్లతో రాస్తారోకో చేయడం ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతూ రేవంత్ రెడ్డికి కౌంట్‌డౌన్ మొదలైందన్నారు. పంటలు ఎండిపోతుంటే రైతులు రోడ్డెక్కారు.. కానీ ప్రభుత్వానికి ఏ మాత్రం పట్టింపు లేకపోవడం దుర్మార్గమని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు 24 గంటల కరెంట్ హామీ ఇచ్చి, ఇప్పుడు రైతులకు 6--8 గంటల విద్యుత్ కూడా సరఫరా చేయకపోవడం శోచనీయమని అన్నారు. రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం, వారి గోడును పట్టించుకోకుండా చోద్యం చూడడం విడ్డూరమని తెలిపారు. ముఖ్యమంత్రి సొంత గ్రామానికి కూతవేటు దూరంలోనే రైతులు కరెంట్ కోసం జాతీయ రహదారిపైకి రావాల్సి పరిస్థితిని వస్తే దాన్ని 'ప్రజా పాలన' అంటారా? అని నిలదీశారు. సొంత ఇలాకాలోని రైతుల సమస్యలే పరిష్కరించలేని సీఎం , తెలంగాణలోని లక్షలాది మంది రైతుల సమస్యలను ఎలా పరిష్కరిస్తారు? ఇదేనా కాంగ్రెస్ తెచ్చిన 'మార్పు' . రైతుల ఆక్రందన రేవంత్ రెడ్డికి వినిపించడం లేదా ? ఇప్పటికైనా రేవంత్ రెడ్డి మొద్దునిద్ర వీడి రైతుల పొలాలకు 24 గంటల కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



# కూరగాయల సాగు విస్తీర్ణం పెంపునకు కృషి

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- లక్ష ఎకరాల్లో కూరగాయల సాగుకు ప్రణాళిక
- సాగు ప్రోత్సాహకానికి రూ.125 కోట్లకు పైగా కేటాయింపులు
- శంషాబాద్ సమీపంలో 170 ఎకరాల్లో కోహెడ మార్కెట్

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):** తెలంగాణలో తగ్గుతున్న కూరగాయల సాగు విస్తీర్ణాన్ని తిరిగి పెంచి, రాష్ట్రాన్ని కూరగాయల ఎగుమతి స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందిస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. గతంలో 3 లక్షల ఎకరాల్లో ఉన్న కూరగాయల సాగు ప్రస్తుతం లక్ష ఎకరాలకు తగ్గిందని, దీనివల్ల ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని వివరించారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రస్తుత వానాకాలంలో లక్ష ఎకరాలు, రబీలో మరో లక్ష ఎకరాల్లో సాగు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. నారు, మల్చింగ్, షేడ్‌నెట్లు, శాశ్వత పందిళు మరియు బిందు సేద్యం కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 125 కోట్లకు పైగా రాయితీలు కేటాయించినట్లు వెల్లడించారు. రైతులకు అదనపు ఆదాయం అందించేందుకు ఆయిల్‌పామ్ తోటల్లో అల్లం, కంది, కూరగాయల వంటి అంతర పంటలను ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. పంటల నిల్వ, ఎగుమతుల కోసం విమానాశ్రయం సమీపంలో 170 ఎకరాల్లో భారీ 'కోహెడ మార్కెట్' ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారని, రాబోయే రెండు మూడేళ్లలో దీన్ని అందుబాటులోకి తెస్తామని చెప్పారు. మరోవైపు వ్యవసాయ విద్యలో నాణ్యతా ప్రమాణాలు పాటించని 6 ప్రైవేట్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలల గుర్తింపును రద్దు చేశామని స్పష్టం చేశారు. విద్యార్థుల అవసరాల దృష్ట్యా హుజూర్ నగర్, డిచ్‌పల్లి, వికారాబాద్‌లలో కొత్త వ్యవసాయ కళాశాలలను మంజూరు చేసి, సీట్ల సామర్థ్యాన్ని 1,100 నుంచి 2,000కు పెంచామని మంత్రి సభకు వివరించారు.

# పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

- గ్రామ పంచాయతీల సొంత నిధులు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ
- ట్రెజరీ విధానానికి స్వస్తి పలుకుతూ సెక్షన్ 70(3)కి సవరణ
- చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):** గ్రామ పంచాయతీలకు సొంత వనరుల ద్వారా సమకూరే ఆదాయాన్ని ఇకపై ప్రభుత్వ ట్రెజరీలో కాకుండా నేరుగా పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసుకునేందుకు వీలుగా తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం–2018 లోని సెక్షన్ 70(3) సవరణ బిల్లుకు శాసనసభ గురువారం ఆమోదముద్ర వేసింది. ఈ చట్ట సవరణ బిల్లును పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అసెంబ్లీలో ప్రవేశపెట్టగా, సభ సమగ్రంగా చర్చించి ఆమోదించింది. ప్రస్తుతం సొంత నిధులను ట్రెజరీలో వేయడం వల్ల అవసరమైనప్పుడు డ్రా చేసుకోవడంలో తీవ్ర ఆలస్యం జరుగుతోందని, కేంద్ర, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ నిధుల మాదిరిగానే జీపీ సొంత రాబడిని కూడా బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం ద్వారా నిధుల లభ్యత సులువవుతుందని మంత్రి తెలిపారు. సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా రూ. 54 కోట్లు విడుదల చేస్తోందని, సర్పంచ్‌లకు పంచాయతీరాజ్‌శాఖ నుంచి ఎలాంటి నిధుల బాకీలు లేవని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడం వల్ల 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ. 700 కోట్ల వరకు పెండింగ్ నిధులు ఇప్పుడిప్పుడే విడుదలవుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విబి–జి రామ్ జి (వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవికా మిషన్ – (గ్రామీణ్) పథకం ద్వారా రూ. 2,000 కోట్ల వరకు అదనపు భారం పడుతున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు, పంట కుంటల నిర్మాణాలు చేపడుతున్నామని వెల్లడించారు. వివాదాల వల్ల ఎన్నికలు జరగని గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా నిధులు కేటాయిస్తోందని వివరించారు. ఈ చర్చలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహా పలువురు ఎమ్మెల్యేలు పాల్గొని విలువైన సూచనలు అందించారు.

# ఉద్యోగుల పక్షాన ఉంటా..

## సమస్యలపై సీఎంతో జేఏసీ చర్చలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):** ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వ ఆహ్వానం మేరకు సీఎంను కలిసి తమ సమస్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న పని ఒత్తిడిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులకు జరుగుతున్న ఆర్థిక నష్టాన్ని వివరించారు. పీఆర్‌సీ కమిటీ నివేదిక ఆలస్యం కావడంతో ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను కూడా జేఏసీ నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ సంఘాల నాయకులపై పెరుగుతున్న ఒత్తిడి గురించి కూడా వివరించారు. సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన సీఎం.. తాను ఎప్పుడూ ఉద్యోగుల పక్షానే ఉంటానని హామీ ఇచ్చినట్లు 'తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్' (టీఆర్‌ఈఎస్‌ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె. గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి తెలిపారు. ఆరు డీఏలపై త్వరలోనే ప్రకటన చేస్తామని సీఎం చెప్పినట్లు వారు వెల్లడించారు. పీఆర్‌సీ కమిటీ నివేదిక కూడా వెంటనే తనకు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని సీఎం స్పష్టం చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సీఎం సానుకూలంగా స్పందించి హామీలు ఇవ్వడంపై టీఆర్‌ఈఎస్‌ఏ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని నేతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో టీఆర్‌ఈఎస్‌ఏ గౌరవాధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి ఉన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఫేక్ అకౌంట్లు సృష్టిస్తోంది

- ఫేక్ సోషల్ మీడియా ద్వారా మాపై దాడిచేస్తోంది
- ఫేక్ వార్తను అసెంబ్లీలో రేవంత్ ప్రస్తావిస్తున్నారు
- సభకు, ప్రజలకు సిఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి
- సిఎంపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తాం
- నీళ్లు ఉండి మోటార్లు నడపడం చాతకాని సిఎం
- ఇలాంటి ముఖ్యమంత్రిని నిన్నే చూస్తున్నా..
- రేవంత్ రెడ్డి మార్షల్స్‌తో మమ్మల్ని ఎత్తడం కాదు..
- మోటార్లు ఆన్ చేసి రైతులకు నీళ్లు ఎత్తు రేవంత్
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడి




**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికగా ఫేక్ అకౌంట్లను సృష్టించి ప్రతిపక్షాలపై అత్యంత దుర్మార్గమైన దాడికి పాల్పడుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులే స్వయంగా నిర్వహిస్తున్న ఒక ఫేక్ అకౌంట్‌లోని పోస్టులను పట్టుకుని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రస్తావించడం కన్నా దౌర్భాగ్య పరిస్థితి మరొకటి లేదని ఎద్దేవా చేశారు. తాజాగా సోషల్ మీడియాలో కలకలం రేపుతున్న 'సంధ్యా రావు' అనే ఫేక్ అకౌంట్ వెనుక కాంగ్రెస్ పార్టీ హ్యాండ్లర్లే ఉన్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఆ నకిలీ ఖాతాలో చేసిన వ్యాఖ్యల ఆధారంగా ముఖ్యమంత్రి శాసనసభను తప్పుదోవ పట్టించారని, దీనికి బాధ్యత వహిస్తూ రేవంత్ రెడ్డి వెంటనే సభకు, ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సదరు ఫేక్ అకౌంట్‌పై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, దాని వెనుక ఉన్న ముఠాను అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన అంశంపై ముఖ్యమంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తామని... అలాగే ఈ పరువు నష్టం, నకిలీ ఖాతాల వ్యవహారంపై పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి మార్షల్స్‌తో మమ్మల్ని ఎత్తడం కాదు.. మోటార్లు ఆన్ చేసి రైతులకు నీళ్లు ఎత్తు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అదే మహబూబ్ నగర్ జిల్లాలో భీమా ప్రాజెక్టులో 3 మోటార్లు ఉంటే ఒక్క మోటార్ మాత్రమే నడుపుతున్నారు. నికర జలాల కేటాయింపులున్న ప్రాజెక్ట్ భీమా. కానీ ఏ జలాల కేటాయింపులు లేని, బేసిన్ లేని వెలిగొండకి మాత్రం చంద్రబాబు నీళ్లు తీసుకుపోతడు.. బేసిన్లు ఉన్న నికర జలాల కేటాయింపులు ఉన్న అన్ని అనుమతులున్న భీమా మోటార్లు ఎందుకు నడపడం లేదు రేవంత్ రెడ్డి.. ఇదేనా నీకు పాలమూరు మీద ఉన్న ప్రేమ అని హరీశ్ రావు అడిగారు. కరువు పీడిత ప్రాంతం నడిగడ్డ, గద్వాల, అలంపూర్ ప్రాంతానికి నీళ్లిచ్చే నెట్టంపాడులో 4 మోటార్లు ఉంటే ఒకటే నడుపుతున్నారన్నారు హరీశ్ రావు . కోయిల్ సాగర్‌లో 3 మోటార్లు ఉంటే ఒక్కటే నడుపుతున్నారు. రెండు మోటార్లు నడిపితేనే కోయిల్ సాగర్ నిండడానికి 3 నెలలు పడుతుంది.. ఇప్పుడు నువ్వు ఒక్కటే మోటార్ నడిపితే అది నిండడానికి 6 నెలలు పడుతుంది. 6 నెలల వరకు జూరాల ప్రాజెక్టులో నీళ్లు ఉంటాయా..? కోయిల్ సాగర్ నిండుతదా అని ప్రశ్నించారు. నీళ్లు ఉండి మోటార్లు నడపలేని చాతకాని ముఖ్యమంత్రిని నిన్నే చూస్తున్నానన్నారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు 2014-15 నుండి 2023-24 వరకు ప్రతి సంవత్సరం వచ్చిన కృష్ణ నది నీళ్లలో 45 శాతం నుండి 30 శాతం ఎత్తామని.. కాంగ్రెస్ ప్రభుత్వం 2024-25లో 28.49 శాతం నీళ్లు ఎత్తారు, 2025-26లో 25 శాతం మాత్రమే ఎత్తారని హరీశ్ రావు తెలిపారు. దీన్ని బట్టి ఎవరు తెలంగాణ ప్రయోజనాలు కాపాడారో అర్థం కావడం లేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కృష్ణ జలాల్లో అతి తక్కువ సాగు నీరు వాడుకున్నది ఈ మూడు సంవత్సరాలలోనేనన్నారు.

# అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు

## తుమ్మల పనితీరుపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా సేవలు అందిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు పనితీరుపై బీజేపీ శాసనసభ్యులు పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. పార్టీలు వేరైనా ప్రజలకు మంచి చేసే నాయకుడిని, వారి నిబద్ధతను గుర్తించి మెచ్చుకోవడంలో తప్పులేదని వారు స్పష్టం చేశారు. "మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా మేము కూడా ఇంతటి ఓపిక, జవాబుదారీతనం ఉన్న మంత్రిని గతంలో చూడలేదు" అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఏ సమస్యపై ఫోన్ చేసినా మంత్రి తుమ్మల వెంటనే స్పందిస్తారని... ఆదివారాలు లేదా సెలవు రోజుల్లో కూడా ప్రజా సమస్యలపై అందుబాటులో ఉంటారని తెలిపారు. సమీక్షలు లేదా పనుల్లో ఉండి ఫోన్ తీయలేకపోయినా, వీలైనంత త్వరగా తిరిగి ఆయనే కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు. ప్రజలు లేదా నియోజకవర్గాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళితే ఎంతో ఓపికతో విని, ఆ సమస్య పూర్తయ్యే వరకు అధికారులతో స్వయంగా మాట్లాడతారని పేర్కొన్నారు. పని ఏ దశలో ఉందో, ఎప్పుడు పరిష్కారమవుతుందో కూడా మళ్లీ తిరిగి ఫోన్ చేసి అప్‌డేట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. శాసనసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు, తోటి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పాలనా సమర్థతను, ఓపికను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యేలు సూచించారు.



## సంపాదకీయం



# ప్రైవేటీకరణకే మొగ్గు?

**ఇస్రో భవిష్యత్తుపై పెరుగుతున్న ఆందోళనలు**

**అంతరిక్ష రంగంలో పెరుగుతున్న ప్రైవేట్ భాగస్వామ్యం**

**కీలక కార్యకలాపాల బదిలీపై సందేహాలు**

**ఇస్రో కేంద్ర పాత్ర దెబ్బతినకూడదనే ఆందోళన**

**పరిశోధన, వ్యూహాత్మక నియంత్రణ ప్రభుత్వానిదే కావాలి**

**ప్రైవేట్ పెట్టుబడులు అవసరమే.. ఇస్రోను బలిపెట్టొద్దు**

అంతరిక్ష పరిశోధనలో భారత్‌ను ప్రపంచ అగ్రదేశాల సరసన నిలిపిన సంస్థ ఇస్రో. పరిమిత వనరులతోనే అసాధారణ విజయాలు సాధిస్తూ దేశ శాస్త్రసాంకేతిక సామర్థ్యానికి ప్రతీకగా నిలిచింది. చంద్రయాన్ నుంచి మంగళయాన్ వరకు, ఉపగ్రహ ప్రయోగాల నుంచి అంతరిక్ష పరిశోధనల వరకు భారత్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టింది. అలాంటి ఇస్రో భవిష్యత్తు ఇప్పుడు కొత్త చర్చకు కేంద్రబిందువుగా మారుతోంది. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థలకు పెరుగుతున్న అవకాశాలతో.. ఇస్రోను కూడా క్రమంగా ప్రైవేటీకరణ వైపు నడిపిస్తున్నారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఇస్రోను ప్రైవేటీకరించడం లేదని చెబుతున్నప్పటికీ, అంతరిక్ష రంగంలో అమలవుతున్న విధాన మార్పులపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. రాకెట్ల తయారీ, ఉపగ్రహాల నిర్మాణం, ప్రయోగ సేవలు వంటి కార్యకలాపాల్లో ప్రైవేట్ రంగానికి విస్తృత అవకాశాలు కల్పిస్తున్నారు. ఒకప్పుడు ప్రధానంగా ప్రభుత్వ ఆధీనంలో కొనసాగిన అంతరిక్ష రంగంలో ఇప్పుడు ప్రైవేట్ పెట్టుబడులకు తలుపులు తెరుచుకున్నాయి.

### ప్రైవేట్ భాగస్వామ్యం తప్పు కాదు.. కానీ!

అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించడాన్ని తప్పుబట్టాల్సిన అవసరం లేదు. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం పెరుగుతోంది. కొత్త పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, ఉపాధి అవకాశాలు, వేగవంతమైన ఆవిష్కరణలకు ప్రైవేట్ రంగం దోహదపడగలదు. అయితే భాగస్వామ్యానికి, ప్రభుత్వ సంస్థ కేంద్ర పాత్రను బలహీనపరచడానికి మధ్య స్పష్టమైన గీత ఉండాలి. అమెరికాలో నాసా ప్రైవేట్ సంస్థలతో కలిసి పనిచేస్తున్నప్పటికీ కీలక పరిశోధనలు, అంతరిక్ష కార్యక్రమాల దిశానిర్దేశంలో తన ప్రధాన పాత్రను కొనసాగిస్తోంది. భారత్‌లోనూ ఇస్రో విషయంలో అదే సూత్రాన్ని పాటించాల్సిన అవసరం ఉంది.

### కొత్త వ్యవస్థలు.. కొత్త సందేహాలు


అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు ఇన్-స్పేస్, వాణిజ్య కార్యకలాపాల కోసం ఎన్ఎస్ఐఎల్ వంటి వ్యవస్థలు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా ప్రైవేట్ రంగానికి అవకాశాలు విస్తరించడం అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలకు ఉపయోగపడవచ్చు. అదే సమయంలో ఇస్రో పరిశోధన, అభివృద్ధి సామర్థ్యాలు మరింత బలోపేతం కావాలి తప్ప తగ్గకూడదు. ప్రైవేట్ సంస్థలకు ఏ కార్యకలాపాలు అప్పగిస్తారు? ఇస్రో వద్ద ఏ వ్యూహాత్మక బాధ్యతలు కొనసాగుతాయి? సాంకేతిక పరిజ్ఞానం బదిలీకి హద్దులేమిటి? జాతీయ భద్రతకు సంబంధించిన అంతరిక్ష వ్యవస్థలపై నియంత్రణ ఎవరి చేతుల్లో ఉంటుంది? వంటి అంశాల్లో పూర్తి పారదర్శకత అవసరం. ఇస్రో అంటే కేవలం రాకెట్లు, ప్రయోగ కేంద్రాలు, ఉపగ్రహాలు మాత్రమే కాదు. దశాబ్దాలుగా దేశం నిర్మించుకున్న శాస్త్రీయ విజ్ఞానం, అనుభవం, వేలాది మంది శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల మేధోసంపత్తి దాని అసలు బలం. ఆ మానవ వనరులను కాపాడుకోవడం అత్యంత కీలకం. ప్రైవేట్ రంగం విస్తరిస్తున్న నేపథ్యంలో నైపుణ్యం కలిగిన శాస్త్రవేత్తలు బయటకు వెళ్లకుండా ఇస్రోలో పరిశోధనకు మరింత స్వేచ్ఛ, తగిన ప్రోత్సాహం, ఆధునిక సదుపాయాలు, అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వ సంస్థను బలహీనపరిచి ప్రైవేట్ రంగాన్ని బలోపేతం చేయడం కాకుండా.. రెండింటి సామర్థ్యాలు దేశ ప్రయోజనాలకు ఉపయోగపడే విధానమే అవసరం. భారత అంతరిక్ష మార్కెట్ విస్తరిస్తున్న కొద్దీ దేశీయ, అంతర్జాతీయ ప్రైవేట్ సంస్థలు సహజంగానే ఆసక్తి చూపుతాయి. ఇందులో తప్పేమీ లేదు. కానీ కొద్దిమంది పెద్ద కార్పొరేట్ సంస్థల చేతుల్లోనే అవకాశాలు కేంద్రీకృతమయ్యే పరిస్థితి ఏర్పడకుండా ప్రభుత్వం జాగ్రత్త వహించాలి. స్టార్టప్‌లు, చిన్న, మధ్యతరహా సాంకేతిక సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలకు కూడా సమాన అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వ నిధులతో దశాబ్దాలుగా అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానం బదిలీలో ప్రజా ప్రయోజనమే ప్రధాన ప్రమాణంగా ఉండాలి.

### ఇస్రో కేంద్ర పాత్ర చెక్కుచెదరకూడదు

అంతరిక్ష రంగాన్ని ప్రైవేట్ పెట్టుబడులకు తెరవడం ఒక విధాన నిర్ణయం. దాన్ని నేరుగా 'ఇస్రో ప్రైవేటీకరణ'గా పేర్కొనడం సరైంది కాదు. అదే సమయంలో ప్రైవేట్ రంగ విస్తరణ పేరుతో ఇస్రో పరిశోధన సామర్థ్యం, స్వతంత్రత, వ్యూహాత్మక ప్రాధాన్యం తగ్గకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. భవిష్యత్తు అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో ప్రైవేట్ సంస్థలకు స్థానం ఉండాలి. కానీ పరిశోధన, ఆవిష్కరణ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన వ్యూహాత్మక దిశానిర్దేశంలో ఇస్రోనే కేంద్రంగా కొనసాగాలి. ప్రైవేట్ సంస్థలు పోటీదారులుగా కాకుండా దేశ అంతరిక్ష సామర్థ్యాన్ని పెంచే భాగస్వాములుగా ఎదగాలి. ప్రైవేట్ పెట్టుబడులు రావాలి.. అంతరిక్ష రంగం విస్తరించాలి.. కొత్త ఉద్యోగాలు పుట్టాలి.. భారత కంపెనీలు ప్రపంచ మార్కెట్‌లో పోటీపడాలి. కానీ ఆ ప్రయాణంలో దేశం దశాబ్దాలుగా నిర్మించుకున్న ఇస్రోను బలహీనపరిచే పరిస్థితి మాత్రం రాకూడదు. ఇస్రోను ప్రైవేటీకరించాలన్న ఆలోచన ఏ దశలోనైనా ఉంటే దానిని విరమించుకోవాలి. ఎందుకంటే ఇస్రో ఒక సంస్థ మాత్రమే కాదు.. భారత శాస్త్రీయ స్వావలంబనకు ప్రతీక.

# మోదీతో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ భేటీ

- అభివృద్ధి భాగస్వామ్యంపై కీలక చర్చ
- ఆరోగ్యం.. వ్యవసాయం.. గ్రామీణాభివృద్ధిపై దృష్టి
- మహిళలు, యువత సాధికారతకు ప్రాధాన్యం
- ఇమామ్‌గా బాధ్యతల తర్వాత తొలి భారత పర్యటన
- సెప్టెంబర్ 15 వరకు పలు నగరాల్లో పర్యటన



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):** భారత పర్యటనలో ఉన్న షియా ఇస్మాయిలీ ముస్లింల 50వ ఆధ్యాత్మిక నాయకుడు, ఆగా ఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ ఛైర్మన్ ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5 బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, యువత, మహిళా సాధికారత తదితర రంగాల్లో భారత్-ఆగా ఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ మధ్య కొనసాగుతున్న భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై ఇరువురు చర్చించారు. సమావేశం అనంతరం ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌ను కలవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఆయన తండ్రి, దివంగత ఆగా ఖాన్-4 అభివృద్ధి రంగంలో అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నట్లు తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, మహిళలు, యువత సాధికారత రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత విస్తరించే మార్గాలపై చర్చించినట్లు వెల్లడించారు. ఇస్మాయిలీ సమాజం 50వ ఇమామ్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రిన్స్ రహీమ్ భారత్‌లో అధికారికంగా పర్యటించడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోనూ సమావేశం కానున్నట్లు సమాచారం. సెప్టెంబర్ 15 వరకు కొనసాగనున్న పర్యటనలో ప్రిన్స్ రహీమ్ ఢిల్లీతో పాటు అహ్మదాబాద్, ముంబై, హైదరాబాద్‌ను సందర్శించనున్నారు. ఆయా ప్రాంతాల్లో ఆగా ఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సామాజిక, వారసత్వ పరిరక్షణ, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించనున్నారు. భారత్, ఆగా ఖాన్ సంస్థల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న అభివృద్ధి భాగస్వామ్యాన్ని ప్రిన్స్ రహీమ్ పర్యటన మరింత ముందుకు తీసుకెళ్తుందని విదేశాంగ శాఖ పేర్కొంది.

# 'బాలికను బెదిరిస్తే సహించేది లేదు'


**బాధితురాలి భద్రతపై సుప్రీంకోర్టు సీరియస్**

**సీజేపీ నిరసనల్లో పాల్గొన్న బాలిక కేసుపై విచారణ**

**స్వతంత్ర భరద్వాజ్‌పై వేధింపులు, దాడి ఆరోపణలు**

**ఎస్సీ, ఎస్టీ చట్టం కింద అదనపు సెక్షన్లు**





**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):** గత జూలైలో జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనల్లో పాల్గొన్న 14 ఏళ్ల బాలికపై నమోదైన వేధింపుల ఆరోపణల వ్యవహారాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. నేర దర్యాప్తు, న్యాయపరమైన చర్యలు కొనసాగుతున్న సమయంలో బాధిత బాలికను గానీ, ఆమె కుటుంబ సభ్యులను గానీ బెదిరించేందుకు వీల్లేదని స్పష్టం చేసింది. బాలికపై హింసకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు స్వేచ్ఛగా తిరుగుతూ బాధితురాలిని లేదా ఆమె కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేస్తే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించింది. గురువారం ఈ వ్యవహారంపై ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. నేర దర్యాప్తు, న్యాయపరమైన ప్రక్రియలను కొనసాగించకుండా బాధితురాలిని, ఆమె కుటుంబాన్ని బెదిరించే పరిస్థితి ఉండకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. బాలిక తరఫు న్యాయవాది కోర్టుకు పలు అంశాలను వివరించారు. రైట్ వింగ్ కార్యకర్త స్వతంత్ర భరద్వాజ్‌పై కేసు నమోదైన తర్వాత బాలికను వేధించడంతో పాటు ఆమె ఇంటిని కూడా ధ్వంసం చేశారని ఆరోపించారు. సీజేపీ నిరసన సందర్భంగా బాలిక తండ్రిపైనా దాడి జరిగిందని కోర్టుకు తెలిపారు. ఈ ఘటనలకు సంబంధించిన వీడియోలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. కేసు విచారణకు ఉన్నతస్థాయి కమిటీకి కొంత సమయం పట్టే అవకాశం ఉందని, ఈలోగా బాలికకు ఏదైనా జరిగితే ఆ నష్టాన్ని భర్తీ చేయడం అసాధ్యమని న్యాయవాది వాదించారు. ఈ వాదనలపై స్పందించిన ధర్మాసనం.. బాలికపై హింసకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు స్వేచ్ఛగా తిరుగుతూ బాధిత కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేస్తే అది అత్యంత తీవ్రమైన విషయమని పేర్కొంది. ఇలాంటి వ్యవహారాలను తేలిగ్గా తీసుకోలేమని స్పష్టం చేసింది. బాలికపై హింసకు సంబంధించిన అంశాల్లో ఎవరినీ రక్షించకూడదని పేర్కొంది.

### భరద్వాజ్‌పై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద సెక్షన్లు

స్వతంత్ర భరద్వాజ్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌లో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంలోని నిబంధనలతో పాటు నేరపూరిత బెదిరింపులకు సంబంధించిన సెక్షన్లను ఢిల్లీ పోలీసులు సెప్టెంబర్ 5న చేర్చినట్లు సమాచారం. బాలిక తండ్రిపై దాడి చేసినట్లు భరద్వాజ్ ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారని, రాజకీయ ప్రోత్బలంతోనే అరెస్టు నుంచి తప్పించుకున్నానని చెప్పినట్లు వచ్చిన కథనాల నేపథ్యంలో ఈ వ్యవహారం మరింత వివాదాస్పదమైంది. ఈ పరిణామాల అనంతరం స్వతంత్ర భరద్వాజ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన జరిగినట్లు తెలుస్తోంది. భరద్వాజ్‌పై చర్యలు తీసుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే పోలీసులు స్వతంత్ర భరద్వాజ్‌ను బులంద్‌షహర్‌లో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. బాధిత బాలిక, ఆమె కుటుంబ సభ్యుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేయడంతో ఈ కేసు ప్రాధాన్యం సంతరించుకుంది. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో బాధిత కుటుంబాన్ని బెదిరించే చర్యలకు పాల్పడితే తీవ్రంగా పరిగణిస్తామని ధర్మాసనం తేల్చిచెప్పింది.

# ఢిల్లీలో బ్రిక్స్ మహాసదస్సు


**12, 13 తేదీల్లో భారత్ మండపం వేదిక ■ పుతిన్, జిన్‌పింగ్ సహా అగ్రనేతల రాక**

**15 వేల మంది పోలీసులతో భారీ భద్రత ■ నాలుగోసారి బ్రిక్స్‌కు భారత్ అధ్యక్షత**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):** ప్రపంచ అగ్రనేతలు ఒకే వేదికపైకి రానున్న ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు దేశ రాజధాని న్యూఢిల్లీ సర్వసన్నద్ధమైంది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరగనున్న 18వ బ్రిక్స్ సదస్సుకు ఏర్పాట్లన్నీ పూర్తయినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం ప్రకటించారు. సదస్సుకు వేదికైన భారత్ మండపాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. ప్రపంచ నేతలకు స్వాగతం పలికేందుకు సిద్ధమైన భారత్ మండపం దృశ్యాలను షేర్ చేస్తూ.. "బ్రిక్స్--2026కు సర్వం సిద్ధం" అని పేర్కొన్నారు. సదస్సులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో పాటు పలువురు సభ్య, భాగస్వామ్య, ఆహ్వానిత దేశాల నేతలు ఢిల్లీకి రానున్నారు. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ కూడా సదస్సుకు హాజరుకానున్నట్లు సమాచారం. 2026 సంవత్సరానికి బ్రిక్స్ కూటమికి భారత్ అధ్యక్షత వహిస్తోంది. 'సుస్థిరత, ఆవిష్కరణ, సహకారం, పునరుత్థానం కోసం నిర్మాణం' అనే ఇతివృత్తంతో ఈసారి సదస్సును నిర్వహిస్తున్నారు. 'మానవత్వానికే ప్రథమ ప్రాధాన్యం' అనే దృక్పథానికి అనుగుణంగా కార్యక్రమాలను రూపొందించినట్లు పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాల మధ్య అంతర్గత సహకారాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ, ప్రాంతీయ పరిణామాలు, పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాలపై నేతలు విస్తృతంగా చర్చించనున్నారు. ప్రపంచ నేతల రాక నేపథ్యంలో ఢిల్లీలో భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఢిల్లీ పోలీసులతో పాటు ఇతర భద్రతా సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. దాదాపు 15 వేల మంది పోలీసు సిబ్బందితో పాటు 200 కంపెనీల పారామిలటరీ బలగాలను మోహరించినట్లు సమాచారం. వీవీఐపీల రాకపోకల నేపథ్యంలో పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. బ్రిక్స్ వ్యవస్థాపక సభ్యదేశాల్లో భారత్ ఒకటి. 2012, 2016, 2021లో కూటమికి అధ్యక్షత వహించిన భారత్.. 2026లో నాలుగోసారి బాధ్యతలు చేపట్టింది. ఈ ఏడాదితో బ్రిక్స్ ప్రస్థానానికి 20 ఏళ్లు పూర్తవుతుండటం మరో విశేషం. జనవరి 1న అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి భారత్ దాదాపు 350కి పైగా సమావేశాలు, ఉన్నతస్థాయి కార్యక్రమాలను నిర్వహించి బ్రిక్స్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేసినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. ప్రపంచంలోని కీలక దేశాల అధినేతలు ఢిల్లీకి తరలిరానుండటంతో రెండు రోజుల బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించనుంది.





# హైవే జాప్యంపై సిగ్గుపడుతున్నా.. ప్రారంభోత్సవానికి రాను!

**ముంబై-గోవా పనులపై గడ్కరీ అసహనం**

**నాసిరకం పనులను సహించేది లేదని హెచ్చరిక**

**పనాజీ, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):** ముంబై-గోవా హైవే విస్తరణ పనుల్లో తీవ్ర జాప్యంపై కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు ఇంత ఆలస్యం కావడం పట్ల తాను సిగ్గుపడుతున్నానని వ్యాఖ్యానించారు. అందుకే ఆ రహదారి ప్రారంభోత్సవానికి తాను హాజరుకాబోనని ముందుగానే ప్రకటించారు. గోవా రాజధాని పనాజీ సమీపంలోని పోర్వోరిమ్ వద్ద నిర్మించిన ఆరు లేన్ల ఎలివేటెడ్ రోడ్డు కారిడార్‌ను గడ్కరీ గురువారం ప్రారంభించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, కేంద్ర మంత్రి శ్రీపాద నాయక్, రాష్ట్ర ప్రజా పనుల శాఖ మంత్రి దిగంబర్ కామత్, పర్యాటక శాఖ మంత్రి రోహన్ ఖౌంటే తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడ్కరీ మాట్లాడుతూ ముంబై--గోవా హైవే విస్తరణ పనులు నత్తనడకన సాగడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "ముంబై-గోవా హైవే పనులు ఇంత ఆలస్యం కావడం నాకు సిగ్గుగా అనిపించింది. అందుకే దాని ప్రారంభోత్సవానికి నేను రానని ముందే ప్రకటిస్తున్నా" అని వ్యాఖ్యానించారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో జాప్యం, నాసిరకం పనులకు బాధ్యులైన కాంట్రాక్టర్లు, అధికారులను ఇకపై ఉపేక్షించబోమని గడ్కరీ హెచ్చరించారు. పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని స్పష్టం చేశారు. "ఒక సంవత్సరంలోనే అత్యధిక సంఖ్యలో కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్ చేసి చర్యలు తీసుకుంటా. బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేసి ఒక రికార్డు సృష్టించాలనుకుంటున్నా. ఇక దీన్ని ఆపబోను" అంటూ గడ్కరీ ఘాటుగా హెచ్చరించారు. ముంబై--గోవా హైవే నాణ్యతను స్వయంగా పరిశీలిస్తానని

# అధికారం పోయినా.. అహంకారం పోలేదు!

- **తాతా మధు వ్యాఖ్యలపై కేసీఆర్ క్షమాపణ చెప్పాలి... మహమ్మద్అయూబ్**



**వర్ధన్నపేట, సెప్టెంబరు 10 (సమయం న్యూస్)** : బీఆర్ఎస్, బీజేపీ పార్టీల దళిత వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో గురువారం వర్ధన్నపేట పట్ట ణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై భారీ రాస్తారోకో నిర్వహించారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ నాయకత్వంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు, దళిత సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తాతా మధు వ్యాఖ్యలను బీఆర్ఎస్ అధిష్ఠానం ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు. అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ నేతల అహంకారం తగ్గలేదని విమర్శించారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీకి వచ్చి మాట్లాడే ధైర్యం లేని అసమర్థులు ప్రజాస్వామ్యంపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మాట్లాడుతున్న భాషను ప్రజలు అ స హ్యించుకుంటున్నార ని వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ ముగిసిన అనంతరం సభా ప్రాంగణాన్ని శుద్ధి చేసి దళితులను అవమానించారనే ఆరోపణలపై బీజేపీ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అయూబ్ డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలని కోరారు. ప్రభుత్వ అధికారులపై కేటీఆర్ చేయి చేసుకున్న ఘటన ఆ పార్టీ అహంకార ధోరణికి, చట్టంపై గౌరవం లేకపోవడానికి నిదర్శనమని విమర్శించారు. దళితులను, ప్రభుత్వ అధికారులను అవమానించేలా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్, బీజేపీలకు రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోశాల వెంకన్న, టౌన్ అధ్యక్షుడు ఈగ దామోదర్, ఐనవోలు ఆలయ ఛైర్మన్ కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రశాంత్, వార్డు సభ్యులు, సర్పంచులు, మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వీరనారి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

- **భూమి.. భుక్తి కోసం పోరాడిన ధీరవనిత**
- **ఐలమ్మ ఆశయాల సాధనకు యువత కృషి చేయాలి**
- **టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్**



**నర్సంపేట, సెప్టెంబరు 10 (సమయం న్యూస్)** : తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం నర్సంపేట పట్టణంలోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామానంద్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ విముక్తి ఉద్యమంలో చాకలి ఐలమ్మ కీలక పాత్ర పోషించారని తెలిపారు. వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా, భూమి, భుక్తి కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా ఉద్యమాన్ని కొనసాగించిన ధీరవనితగా ఐలమ్మ చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. ఐలమ్మ వర్ధంతిని నిర్వహించడంతో పాటు ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పంబి వంశీకృష్ణ, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, మాజీ మార్కెట్ ఛైర్మన్ ఎర్ర యాకుబ్‌రెడ్డి, కౌన్సిలర్ పున్నం నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్ట ర్ కొల్లూరి మధుకర్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బైరి మురళీ, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్, కొల్లూరి శ్రీహరి, మోటం రవికుమార్, పెద్దపెల్లి శ్రీనివాస్, ఓర్సు సాంబయ్య, గుడికందుల సదానందం, కొల్లూరి భాస్కర్, మేరుగు కిరణ్‌యాదవ్, నాగెల్లి సారంగం గౌడ్, గిరగాని రమేష్‌గౌడ్, కొల్లూరి రాజు, నేదునూరి రాజు, రాయరాకుల శ్రీనివాస్, శంకరభక్తుల శివ, రామగొని సుధాకర్, గోక వేదప్రకాష్, భూక్య గణేష్, ఉప్పుల షాలోమ్, చీకటి శివమణి తదితరులు పాల్గొన్నారు.

# కష్టాలను గెలవాలి..జీవితాన్ని ప్రేమించాలి..

- **ఆత్మహత్యలు ఏ సమస్యకూ పరిష్కారం కాదు... అనురాగ్ సొసైటీ చైర్మన్ డా. కే.అనితా రెడ్డి**
- **సమస్య ఉంటే పరిష్కారం కూడా ఉంటుంది.. ధైర్యంగా ఎదుర్కోవాలి**



**హనుమకొండ, సెప్టెంబరు 10 (సమయం న్యూస్)** : ఆత్మహత్యలు ఏ సమస్యకూ పరిష్కారం కాదని, జీవితంలో ఎదురయ్యే కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని పరిష్కార మార్గాలను అన్వేషించాలని అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్ట ర్ అనితారెడ్డి అన్నారు. అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హనుమకొండలోని స్వధార్ మహిళా ఆశ్రమంలో 'ఆత్మహత్యల నివారణలో మన పాత్ర' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్ట ర్ అనితారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో సమస్యలు సహజమేనని, వాటి నుంచి పారిపోవడానికి ఆత్మహత్యను ఆశ్రయించకూడదని సూచించారు. తల్లిదండ్రులు మందలించారని, ఉపాధ్యాయులు మందలించారని, ప్రేమలో విఫలమయ్యామని, మార్కులు తక్కువగా వచ్చాయని వంటి చిన్న కారణాలతో జీవితాన్ని అర్ధాంతరంగా ముగించుకోవడం సరైన నిర్ణయం కాదన్నారు. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని విజయాలను సాధించిన వారు సమాజంలో ఎంతోమంది ఉన్నారని తెలిపారు. పిరికితనాన్ని వీడి సమస్యలను ఎదుర్కొనే ధైర్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సమస్య ఉందంటే దానికి పరిష్కారం కూడా ఉంటుందని గుర్తుంచుకోవాలన్నారు. మన జీవితాన్ని ప్రేమించి, గౌరవించుకున్నప్పుడే దాన్ని అందంగా తీర్చిదిద్దుకోగలమని చెప్పారు. తమపై ఆధారపడిన కుటుంబ సభ్యులు, ఆప్తుల గురించి ఒక్కసారి ఆలోచించిన తర్వాతే కఠిన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. కష్టా ల్లో ఉన్నవారిని ఒంటరిగా వదిలేయకుండా వారికి చేయూతనిచ్చి, 'మేమున్నాం' అనే ధైర్యాన్ని కల్పించాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఆత్మహత్యలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. స్వధార్ మహిళా ఆశ్రమానికి వివిధ సమస్యలతో వచ్చే మహిళలు మానసికంగా బలహీనంగా ఉంటారని, వారికి నిరంతరం కౌన్సెలింగ్ అందిస్తూ ఆత్మవిశ్వాసం, ధైర్యాన్ని పెంపొందిస్తున్నామని డాక్ట ర్ అనితారెడ్డి తెలిపారు. తమ సమస్యలను తామే పరిష్కరించుకునేలా తీర్చిదిద్దడంతో పాటు స్వయం ఉపాధి శిక్షణలు అందించి ఆర్థికంగా స్వావలంబన సాధించేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వధార్ నిర్వాహకురాలు శైలజ, కమల, సంధ్యతో పాటు ఆశ్రమంలోని మహిళలు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళి

- **ECILలో విగ్రహానికి పూలమాల వేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ సెప్టె ంబర్10( సమయం న్యూస్)** : తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో చెరగని ముద్ర వేసిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ECILలోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సబ్బండ వర్గాల ఆత్మగౌరవం, మహిళా చైతన్యం, అణగారిన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ సమాజానికి చిరస్మరణీయమని అన్నారు. రజాకారుల అకృత్యాలు, భూస్వాముల దోపిడీని ధైర్యంగా ఎదుర్కొని పేదల పక్షాన నిలిచిన ఆమె స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రజక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



## మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన సదస్సు.



**వలిగొండ సెప్టెంబర్ 10 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పోక్సో (pocso) మరియు మాదకద్రవ్యాల (Drugs) దుష్పరిమానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు తెలియజేశారు. డ్రగ్స్ విద్యార్థుల యొక్క జీవితాలను నాశనం చేస్తాయని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మైనర్లు బైక్ నడపారాదని సూచించారు. విద్యా ర్థుల యొక్క తల్లిదండ్రులు తమ పిల్లలకు బైక్ ఇవ్వకూడదని, అలా ఇచ్చినచో మీరు కూడా బాధ్యులవుతారని హెచ్చరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం ఇస్తున్నటువంటి ప్రోత్సకాలను ఉపయోగించుకుంటూ చదువుపై, క్రీడలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పరశురాములు, అనీఫ్ వెంకటాచారి, మురళి, సురేష్, స్వప్న, సైదా రవి, కృష్ణ, గణేష్ కుమార్, గోపీనాథ్, మృదుల, ఆనంద్, హాజీ వేగం లలిత, సుకన్య విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో నిందితుడికి 9 నెలల 7 రోజుల జైలు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 10:(సమయం న్యూస్)** తలమడుగు పోలీస్ స్టే షన్ పరిధిలో మోటార్‌సైకిల్ దొంగతనం కేసులో నిందితుడు సొలంకి భగత్ (19)కు 9 నెలల 7 రోజుల జైలు శిక్ష విధిస్తూ ఆదిలాబాద్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ (PCR) కోర్టు న్యాయమూర్తి ఎస్. తేజస్విని తీర్పు ఇచ్చారు. 2025 డిసెంబర్ 3న దేవాపూర్ గ్రామ శివారులో చిర్ల స్వామికి చెందిన మోటార్‌సైకిల్ దొంగతనానికి గురైంది. ఎస్సై డి. రాధిక దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. విచారణలో 10 మంది సాక్షులను పరిశీలించిన కోర్టు శిక్ష విధించింది. కేసులో కృషి చేసిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

## లాటరీ ద్వారా ఎక్సైజ్ షాప్ కేటాయింపు



**హైదరాబాద్, సెప్టెంబర్ 10( సమయం: న్యూస్)** సికింద్రాబాద్ ఎక్సైజ్ యూనిట్ పరిధిలోని HYD033 ఎక్సైజ్ షాప్‌ను పారదర్శక లాటరీ ద్వారా కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. ముగ్గురు అభ్యర్థుల నుంచి వచ్చిన ఆరు దరఖాస్తుల్లో తోటకూర శ్రీనుకు చెందిన సీరియల్ నంబర్ 4 ఎంపిక కావడంతో షాప్ కేటాయించారు.

## హక్కులు.. ఆత్మగౌరవం.. ఐక్యతే లక్ష్యం

- **బీసీ పవర్ జిల్లా అధ్యక్షుడిగా దేవులపల్లి ప్రదీప్‌కుమార్**
- **బీసీల భవిష్యత్తు కోసం.. ఐక్యంగా సాగాలి... ఆబోతు రాజు యాదవ్**
- **బీసీల ఐక్యత, రాజకీయ చైతన్యానికి కృషి చేయాలి**



**హనుమకొండ, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్)** : 8వ డివిజన్ సుధానగర్‌కు చెందిన దేవులపల్లి ప్రదీప్‌కుమార్‌ను భారత చైతన్య యువజన పూలే వారసుల రాజ్యం–బీసీ పవర్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా రాష్ట్ర కమిటీ నియమించింది. ఈ మేరకు పెద్దమ్మగడ్డ రోడ్డులోని పద్మశాలి సంక్షేమ భవనంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ కులాల ఐక్యవేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆబోతు రాజు యాదవ్ నూతన జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి ప్రదీప్‌కుమార్ ను శాలువాతో సన్మానించి అభినందించారు. ఆబోతు రాజు యాదవ్ మాట్లాడుతూ హనుమకొండ కేంద్రంగా బీసీల ఐక్యత, రాజకీయ చైతన్యం, సామాజిక ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రదీప్‌కుమార్ కు సూచించారు. అన్ని బీసీ వర్గాలు, నాయకులను సమన్వయం చేసుకుంటూ భవిష్యత్తు బీసీ నాయకత్వాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. బీసీల హక్కులు, ఆత్మగౌరవం, సమాన అవకాశాల కోసం ఐక్యంగా ఉద్యమిస్తూ బీసీ సమాజానికి బలమైన నాయకత్వాన్ని అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పులి విక్రమ్, శ్రీనివాస్, బీసీ పవర్ జిల్లా నాయకుడు అంకాల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎం.టి. సెక్షన్‌కు డ్రైవర్ల ఎంపిక కోసం పోలీస్ సిబ్బందికి డ్రైవింగ్ టెస్ట్

**జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ అదేశాలమేరకు**



**వికారాబాద్, సెప్టెంబర్,10(సమయం న్యూస్)** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ శాఖలోని ఎం.టి. (Motor Transport) సెక్షన్‌లో డ్రైవర్ల కొరకు, వాహనాల నిర్వహణ మరియు డ్రైవింగ్ విధుల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు అర్హులైన పోలీస్ సిబ్బందిని డ్రైవర్లుగా ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా ఈరోజు జిల్లా పరేడ్ గ్రౌండ్‌లో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు ఎస్పీ రాజేశ్ మీనా,ఐపీఎస్ హాజరు అవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి వాహనాల నిర్వహణ, సురక్షిత డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, విధి నిర్వహణలో అప్రమత్తత వంటి అంశాలపై అదనపు ఎస్పీ అవగాహన కల్పించారు.పోలీస్ శాఖలో డ్రైవర్లుగా విధులు నిర్వహించే సిబ్బంది వాహనాలను బాధ్యతాయుతంగా, నిబంధనలకు అనుగుణంగా మరియు సురక్షితంగా నడపాలని సూచించారు. డ్రైవింగ్‌లో నైపుణ్యం, వాహనాలపై అవగాహన, రహదారి భద్రతా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని అర్హులైన సిబ్బందిని ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ వీరేశ్, డీఎస్‌బీ ఇన్‌స్పెక్ట ర్ నాగార్జున,ఎంవిఐ కే. శ్రీనివాసులు, ఆర్ఐ శ్రీశైలం, ఆర్ఐ నాగరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

## నవీన ఆదర్శ స్కూల్ లో తెలంగాణ భాష దినోత్సవ వేడుకలు



**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్,10(సమయం న్యూస్)** తెలంగాణ కవి రచయిత కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాష దినోత్సవంగా జరుపుకుంటారని ప్రిన్సిపాల్ నరేష్ రాజ్ తెలిపారు.ముందుగా ఉపాధ్యాయ బృందం, ప్రిన్సిపల్ డి.వి.నరేష్ రాజ్ , వైస్ ప్రిన్సిపాల్ సంతోష, విద్యార్థులు అందరు కలిసి కవి రచయిత కాలోజి నారాయణ రావు చిత్రపటానికి పూలమాల వేసిన నివాళి అర్పించారు. అలాగే ప్రిన్సిపల్ డివి నరేష్ రాజ్ మాట్లాడుతూ తెలంగాణ భాష ,యాస, తెలంగాణ సంస్కృతి, తెలంగాణ పండుగల గురించి విద్యార్థులకు తెలియజేశారు.

## లింగవ్వ అంత్యక్రియలకు మానవత్వం చాటిన దేవనూర్ సర్పంచ్ ..

### రేణుకాదేవి కిషన్ రావు ఆర్థి క సాయం అందజేత.



**యాలాల మండలం, సెప్టెంబర్,10(సమయం న్యూస్)** యాలాలమండ లంలోని దేవనూర్ గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధురాలు లింగవ్వ మృతి చెందగా, ఆమె కుటుంబం అంత్యక్రియలు నిర్వహించేందుకు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు మానవత్వం చాటుకున్నారు.వెంటనే స్పందించిన సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు, లింగవ్వ కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో ఎవరికి కష్టం వచ్చినా తమ వంతు సహాయం చేస్తామని, పేద ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు. సర్పంచ్ చేసిన సహాయంపై గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఏం సి డైరెక్టర్ మంత్రి వెంకటయ్య, బోడ్కా మల్లేశం ,మెట్లీ కృష్ణ, గుడ్ల చంద్రయ్య,మాల నర్సిములు, సంగేమ్ రవి, బోడ్కా శ్రీను, గుడ్ల సుభాష్,కృష్ణ, మొహమ్మద్, సురేష్ గ్రామతులు తదితరులు ఉన్నారు.

## టీఎమ్మార్పీఎస్ఆలేరు మండల నూతన కమిటీ ఎన్నిక



**ఆలేరు, సెప్టెంబర్ 10(సమయం న్యూస్):** తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (టీఎమ్మార్పీఎస్) ఆలేరు మండల నూతన కమిటీని గురువారం ప్రకటించారు. టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఆదేశాల మేరకు ఆలేరు మండల కేంద్రంలోని పద్మావతి ఫంక్షన్‌హాల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన టీఎమ్మార్పీఎస్ నాయకుడు కందుల రామన్ మాదిగ నూతన మండల కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలు రాజకీయంగా వెనుకబడటం వల్ల ఆర్థికంగా అనేక అసమానతలను ఎదుర్కొంటున్నారని అన్నారు. రాజకీయ ప్రాతినిధ్యం పెంపొందించుకోవడం ద్వారా సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని పేర్కొన్నారు. మాదిగలు ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని, రాజకీయంగా ఎదిగి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కందుల రామన్ మాదిగ పిలుపునిచ్చారు. సంఘటితంగా ముందుకు సాగుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు.

**నూతన కమిటీ**

ఈ సందర్భంగా టీఎమ్మార్పీఎస్ ఆలేరు మండల అధ్యక్షుడిగా జంగా రాములు మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భూపెల్లి కేశవులు, ఎమ్మెస్పెఫ్ మండల ఇన్‌చార్జిగా రాంచర్ల గౌతమ్‌ను ప్రకటించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు సంఘాన్ని బలోపేతం చేస్తూ, మాదిగల హక్కుల సాధనకు కృషి చేయాలని సమావేశంలో నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు అందె సుధాకర్ మాదిగ, సీనియర్ నాయకులు రాంచర్ల సిద్ధులు మాదిగ, బోడ నరేష్, సైదాపురం సురేష్, కందుల యాదమల్లయ్య, పైసా రవి, కందుల మధు, మనుష్ అర్జున్ , సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

## పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

**రాయపోల్ సెప్టెంబర్ 10.** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర వర్కింగ్ సెక్రటరీ గౌరీ పరుశురాములు, జిల్లా యువజన నాయకులు చింతకింది కర్ణాకర్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ఆమె ప్రదర్శించిన ధైర్యసాహసాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక అసమానతలను తొలగించి అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ తల్లి ఆశీస్సులు.. శాయంపేటకు అభివృద్ధి వరాలు

- ఏళ్ల నాటి రహదారి కష్టాలకు తెర..
- బోనాల సంబరాల మధ్య.. ప్రజలకు రహదారి కానుక
- రూ.90.50 లక్షలతో నిర్మించిన పోచమ్మ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హన్మకొండ/శాయంపేట, సెప్టెంబరు 10 (సమయం న్యూస్) :** పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. శాయంపేటలో గురువారం నిర్వహించిన పోచమ్మ బోనాల వేడుకల్లో ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు, స్థానికులతో కలిసి బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రూ.90.50 లక్షల వ్యయంతో నిర్మించిన పోచమ్మ రోడ్డును ప్రారంభించారు. ఎన్నాళ్లుగా స్థానికులు ఎదుర్కొంటున్న రహదారి సమస్యకు పరిష్కారం చూపుతూ నాణ్యమైన రహదారి నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం, తన కార్యాలయం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాయని నాయిని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు తదితర మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. శాయంపేటలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది నాటికి పోచమ్మ ఆలయ అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ గుండు సుధారాణి, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌రావు, మాజీ కార్పొరేటర్లు మామిండ్ల రాజు, మోహన్‌రావు, డివిజన్ అధ్యక్షుడు సత్తు రమేష్, నాయకులు రాజు, సురేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ 41 వర్ధంతి

**వలిగొండ సెప్టెంబర్ 10 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శం అని బీసీ సంఘం అధ్యక్షుడు సాయిని యాదగిరి అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ 41వర్ధంతి కార్యక్రమం సందర్భంగా ఉద్యమకారుల ఫోరం నాయకులు మరియు వివిధ కుల సంఘాల నాయకులతో కలిసి పట్టణ కేంద్రంలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన చాకలి ఐలమ్మ సేవలు మరువలేనివి అని అన్నారు.తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత, సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి అని కొనియాడారు. చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని, ఆమె ఆశయాల సాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఆమె ధీర చరిత్ర ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొంది ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉద్యమకారుల సంఘం నాయకులు



క్రిస్టఫర్, మాజీ ఉపసర్పంచ్ పబ్బు సురేందర్, ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్, బోడిగే సుదర్శన్, ఎలిమినేటి సత్యనారాయణ, మైసొల్ల లక్ష్మీనర్సు, యాదగిరి, లక్ష్మయ్య, ఎండి కాసిం, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ తెగువకు ప్రతీక.. చాకలి ఐలమ్మ

- ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం
- వీరనారి ఐలమ్మ పోరాటం.. తరతరాలకు స్ఫూర్తి
- తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ జిల్లా అధ్యక్షుడు షేక్ జావీద్



**నర్సంపేట, సెప్టెంబరు 10 (సమయం న్యూస్) :** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన వీరవనిత చాకలి ఐలమ్మ అని తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం నర్సంపేట పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐలమ్మ విగ్రహానికి అంబటి శ్రీనివాస్, తెలంగాణ జన సమితి వరంగల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన, భూస్వాముల దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. సామాన్య కుటుంబంలో జన్మించిన ఆమె అన్యాయాన్ని ఎదిరిస్తూ, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడారని తెలిపారు. తన భూమిని కాపాడుకోవడమే కాకుండా పేదలకు భూమి, భుక్తి, విముక్తి కల్పించాలనే లక్ష్యంతో ఉద్యమించిన ధీరవనితగా ఐలమ్మ నిలిచారని అన్నారు. అణచివేతకు తలొగ్గకుండా పోరాడిన ఐలమ్మ ధైర్యం, ఆత్మవిశ్వాసం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. నేటి యువత ఆమె జీవితాన్ని, పోరాటాన్ని తెలుసుకుని ఆమె అడుగుజాడల్లో నడవాలని సూచించారు. సమాజంలో అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం, సమానత్వం కోసం ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మను కేవలం వర్ధంతి రోజున స్మరించుకోవడం కాకుండా ఆమె ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి అని అన్నారు. అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం, సమాజం కోసం నిలబడే తత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుంటి రామచందర్, బోనగాని రవీందర్, మహమ్మద్ మెహబూబ్‌అలీ, సొల్తి సాయికుమార్, మహమ్మద్ సందాని, సాంబరాతి మల్లేశం, భగత్, మహమ్మద్ అబూబకర్, రాజు, అంకాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

**ఆలేరు, సెప్టెంబర్ 10(సమయం న్యూస్):** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని ఆలేరు పట్టణం, కొలనుపాకలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాల్లో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు నాయకులు, రజక సంఘం ప్రతినిధులు, ప్రజలు ఘనంగా నివాళులర్పించారు. ఆలేరు జెడ్పీహెచ్ఎస్ ఆవరణలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి ఆలేరు పట్టణ రజక సంఘం జనరల్ సెక్రటరీ ఆలేటి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిందన్నారు. పెత్తందారీ వ్యవస్థ, దొరల అణచివేతకు వ్యతిరేకంగా ఆమె ప్రదర్శించిన ధైర్యం, ఆత్మగౌరవం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాటం: ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ మాట్లాడుతూ పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో



చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అన్యాయానికి, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె చూపిన ధైర్యం, ఆత్మగౌరవం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. మహిళా సాధికారత, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఐలమ్మ చేసిన కృషిని స్మరించుకుంటూ ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఆలేరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ బి.జగన్‌మోహన్, కౌన్సిలర్ మల్లెల సరిత శ్రీకాంత్, పట్టణ ప్రముఖులు జెట్ట సిద్ధులు, వనరాశి మార్క్, ఏగ్గిడి శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

**కొలనుపాకలో ఘనంగా వర్ధంతి:**

కొలనుపాకలో శ్రీ బాపూజీ రజక సహకార సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. విసునూరు దేశ్‌ముఖ్, దొరల అణచివేతకు వ్యతిరేకంగా తన భూమి, హక్కుల పరిరక్షణ కోసం ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రలో కీలక ఘట్టమని అన్నారు. భూమి, పంటపై రైతుకే హక్కు ఉండాలనే ఆత్మగౌరవ భావనతో ఆమె సాగించిన పోరాటం నాటి ప్రజల్లో చైతన్యం నింపిందని పేర్కొన్నారు. రజక సంఘం అధ్యక్షుడు మామిడాల బాలమల్లేష్, గ్రామ సర్పంచ్ బేధారబోయిన యకమ్మ వెంకటేష్, రాఘవాపురం సర్పంచ్ పరిదే మమతా సంతోష్, మాజీ అధ్యక్షుడు మామిడాల నర్సింహులు, సోమయ్య, మాజీ సర్పంచ్ గంగుల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మామిడాల అంజయ్య, మామిడాల భానుచందర్, అశోక్, మాజీ ఎంపీటీసీ ప్రశాంత్, పీఏసీఎస్‌డైరెక్ట ర్ చాడ రాజు, బండ విరమల్లయ్య, అరె మల్లేష్, సోమరాజు, బాలరాజు, మామిడాల నవీన్, భానుశంకర్, ప్రసాద్, మధు, కర్ణాకర్, క్రాంతి, వార్డు సభ్యులు, రజక కుటుంబ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆలేరు పట్టణంలో జరిగిన కార్యక్రమంలో రజక సంఘం ప్రతినిధులు ముదిగొండ శ్రీకాంత్, ఆలేటి భాస్కర్, ఆలేటి పాండు, ఆలేటి నర్సింహ, వడ్డెమన్ బాలరాజ్, ఆలేటి మైసయ్య, ఆలేటి లింగం, ఆలేటి రవి, ఆలేటి సంతోష్, పరిదే రాములు, దొంతి సారపు పాండు, ఆలేటి యాకయ్య, నమిలే జలంధర్ తదితరులు పాల్గొన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక న్యాయం, సమానత్వం, పేదలు, రైతుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు పిలుపునిచ్చారు.



# టీమిండియాకు దూరమైన తర్వాత ఆకలి పెరిగింది

దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ 13 ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగిన ఫైనల్లో సౌత్ జోన్‌పై ఆధిపత్యం ప్రదర్శించి టైటిల్ సొంతం చేసుకుంది. ఈ విజయానికి జట్టు సమష్టి కృషి, ఐక్యతే కారణమని కెప్టెన్ ఇషాన్ కిషన్ చెప్పాడు. "ఈ విజయం మా అందరిదీ. ఒకరికొకరం అండగా నిలిచాం. అదే ఈ జట్టు బలం. నాయకుడిగా నేను కూడా నా వంతు బాగానే చేశాననుకుంటా" అంటూ ఇషాన్ నవ్వుతూ చెప్పాడు. అయితే విజయంతో ప్రయాణం ముగియదని అన్నాడు. బ్యాటింగ్, ఫీల్డింగ్ ఇలా అన్ని విభాగాల్లో ఇంకా మెరుగుపడాల్సి ఉందని తెలిపాడు. ఫైనల్లో ఇషాన్ కిషన్ కీలక పాత్ర పోషించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా 270 పరుగులతో భారీ ఇన్నింగ్స్ ఆడాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ 80 పరుగులు చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన భారీ ఆధిక్యంతో ఈస్ట్ జోన్‌కు విజయం ఖాయమైంది. దీంతో 2012-13 సీజన్ తర్వాత తొలిసారి దులీప్ ట్రోఫీని గెలుచుకుంది. జాతీయ జట్టుకు దూరంగా ఉన్న సమయంలో తనలో చాలా మార్పు వచ్చిందని ఇషాన్ చెప్పాడు. ఇప్పుడు మరింత ప్రశాంతంగా ఉంటున్నానని, పరిస్థితులను బాగా అర్థం చేసుకుంటున్నానని చెప్పాడు. జట్టు కోసం ఆడాలనే ఆకలి తనలో మరింత పెరిగిందన్నాడు. జట్టు కోసం ఆడడం, టైటిల్ గెలవడమే ఇప్పుడు తన లక్ష్యమని స్పష్టం చేశాడు. కెప్టెన్‌గా ఇషాన్‌కు ఇది రెండో దేశవాళీ టైటిల్. 2025-26 సీజన్‌లో సొంత రాష్ట్రం ఝార్ఖండ్‌కు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ అందించాడు.

# దులీప్ ట్రోఫీ ఛాంపియన్‌గా ఈస్ట్ జోన్..!

- తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఘనవిజయం
- 13 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు పడిన తెర






చెన్నై వేదికగా జరిగిన దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ పోరులో ఈస్ట్ జోన్ చారిత్రక విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన భారీ ఆధిక్యం ఆధారంగా సౌత్ జోన్‌ను నెట్టివేసి ఛాంపియన్‌గా నిలిచింది. దీంతో ఏకంగా 13 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత ఈస్ట్ జోన్ జట్టు దులీప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఈస్ట్ జోన్.. 708 పరుగులు చేసింది. అనంతరం సౌత్ జోన్ 336 పరుగులకు ఆలౌట్ అయింది. ఈస్ట్ జోన్ తమ రెండో ఇన్నింగ్స్‌ను 388/7 వద్ద డిక్లేర్ చేసింది. ఇక మ్యాచ్ ఫలితం తేలేలా కనిపించకపోవడంతో ఇరు జట్ల కెప్టెన్లు డ్రాకు అంగీకరించారు. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన ఆధిక్యంతో ఈస్ట్ జోన్ విజేతగా నిలిచింది. దీంతో ఈస్ట్ జోన్ ఆటగాళ్లు మైదానంలో సంబరాల్లో మునిగిపోయారు. ఈస్ట్ జోన్ చారిత్రాత్మక విజయంలో ఆ జట్టు కెప్టెన్, వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ప్రధానపాత్ర పోషించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 270 పరుగుల ద్విశతకంతో విరుచుకుపడిన ఇషాన్, రెండో ఇన్నింగ్స్‌లోనూ 80 పరుగులతో మెరిశాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సౌత్ జోన్ బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టిన ఇషాన్ కిషన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. మరోవైపు ఆఖరి రోజున యువ బ్యాటర్ మహమ్మద్ కౌనైన్ ఖురైషి అద్భుతమైన సెంచరీతో నాటౌట్‌గా నిలిచి అందరి దృష్టిని ఆకర్షించాడు. విజయం సాధించిన తర్వాత ఈస్ట్ జోన్ డ్రెస్సింగ్ రూమ్‌లో పండగ వాతావరణం నెలకొంది. ఇషాన్ కిషన్, టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీలు చేతిలో వికెట్ స్టంప్‌లు పట్టుకుని గ్రౌండ్ చుట్టూ తిరుగుతూ అభిమానులకు అభివాదం చేశారు. పిచ్‌పై డ్యాన్స్ చేస్తూ తమ విజయోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఈ విజయం ఈస్ట్ జోన్ క్రికెట్ చరిత్రలోనే అత్యంత ప్రత్యేకమైనదిగా నిలిచిపోనుంది.ఈ మ్యాచ్ ఫలితం ఇప్పటికే తేలిపోయినప్పటికీ, సౌత్ జోన్ స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ చూపించిన క్రీడాస్ఫూర్తి అందరినీ ఆకట్టుకుంది. ఉక్కపోత, తీవ్రమైన అలసట ఉన్నప్పటికీ ఫలితం మారదని తెలిసినా సిరాజ్ వరుసగా 9 ఓవర్లు బౌలింగ్ చేసి తన నిబద్ధతను చాటుకున్నాడు. ఇక సౌత్ జోన్ తరపున ఒంటరి పోరాటం చేసిన యంగ్ సెన్సేషన్ తిలక్ వర్మ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికయ్యాడు. రెండు ఇన్నింగ్స్?ల్లోనూ అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకున్న ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. అతడు మొదటి ఇన్నింగ్స్‌లో 270 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 80 పరుగులు చేశాడు. అలాగే సౌత్?జోన్?కు కెప్టెన్?గా వ్యవహరించిన తిలక్ వర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు దక్కింది.మ్యాచ్ అనంతరం ఇషాన్ కిషన్ తమ జట్టు వ్యూహం గురించి వివరించాడు. "జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నప్పుడు ముందుగా పరిస్థితులను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. మేం రెండు రోజుల పాటు బ్యాటింగ్ చేశాం. దీంతో ఈ మ్యాచ్? ఫలితాన్ని తేల్చేది మొదటి ఇన్నింగ్సే అని మాకు అర్థమైంది. కాబట్టి, ప్రత్యర్థిని వీలైనంత తక్కువ స్కోర్?కు ఆలౌట్ చేసి లీడ్ సాధించడమే మా లక్ష్యం. అయితే మ్యాచ్?లో విజయం సాధించే విధంగా తొలి ఇన్నింగ్స్?లో మాకు లీడ్ వచ్చింది. దీంతో ఇంతటి తీవ్రమైన ఎండలో మేం మళ్లీ మైదానంలోకి ఎందుకు దిగాలని అనుకుంటాం?" అని ఇషాన్ చెప్పాడు.



# 2027 ప్రపంచకప్ వరకు చూద్దాం

## గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో రోహిత్

2027 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ ఆడతాడా? కొంతకాలంగా ఈ ప్రశ్నపై చర్చ జరుగుతోంది. దీనిపై రోహిత్ తాజాగా స్పందించాడు. అయితే తన నిర్ణయాన్ని మాత్రం స్పష్టంగా వెల్లడించలేదు. ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో పాల్గొన్న రోహిత్‌ను ఓ అభిమాని ఇదే విషయంపై ప్రశ్నించాడు. 2027 అక్టోబర్‌లో జరిగే ప్రపంచకప్‌లో ఆడతారా? అని అడిగాడు. దీనికి "2027 అక్టోబర్ చాలా దూరంలో ఉంది. అప్పటికి చూద్దాం" అని రోహిత్ బదులిచ్చాడు. దీంతో ప్రపంచకప్ ఆడే విషయంపై రోహిత్ ఇంకా నిర్ణయం తీసుకోలేదని స్పష్టమైంది. రోహిత్ ఇప్పటికే టెస్టులు, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. 2027 ప్రపంచకప్‌కు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇదే కార్యక్రమంలో.. 2027 ప్రపంచకప్‌ను భారత్ గెలిస్తే 2024 టీ20 ప్రపంచకప్ విజయోత్సవంలా ముంబైలో బస్ పరేడ్ నిర్వహిస్తారా? అని రోహిత్‌ను అడిగారు. "ఇప్పుడు బస్ పరేడ్ సాధ్యమవుతుందని అనుకోవడం లేదు" అని సరదాగా స్పందించాడు. రోహిత్ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలను బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా గతంలో కొట్టిపారేశారు. రోహిత్ అద్భుతంగా ఆడుతున్నప్పుడు అతడి ఎంపికపై సందేహాలు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. ఇంగ్లాండ్‌తో జరిగిన చివరి వన్డేలో రోహిత్ 138 పరుగులు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఊహాగానాలకు తాను ఆజ్యం పోయనని చెప్పారు.

# అఫ్గాన్, ఆసియా గేమ్స్ భారత జట్టులో మార్పులు

- గాయంతో దూరమైన పేసర్ హర్షిత్ రాణా
- జట్టులో చోటు సంపాదించిన యష్ ఠాకూర్



అఫ్గనిస్థాన్‌తో సెప్టెంబర్ 13 నుంచి ప్రారంభం కానున్న 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్, ఆ తర్వాత జరగనున్న ప్రతిష్ఠాత్మక ఆసియా గేమ్స్ కోసం భారత జట్టులో బీసీసీఐ కీలక మార్పు చేసింది. గాయం కారణంగా జట్టుకు దూరమైన యంగ్ పేసర్ హర్షిత్ రాణా స్థానంలో విదర్భ పేసర్ యష్ ఠాకూర్‌ను ఎంపిక చేశారు. గత జులైలో జింబాబ్వే పర్యటనలో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన యష్‌కి ఇది రెండో టీ20 సిరీస్ కావడం విశేషం. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రీహ్యాబిలిటేషన్ పొందుతున్న హర్షిత్ రాణాకు మరోసారి తీవ్ర గాయమైంది. సెప్టెంబర్ 7న జరిగిన మ్యాచ్ సిమ్యులేషన్ సందర్భంగా బౌలింగ్ చేస్తుండగా అతడికి రెక్టస్ ఫెమోరిస్ (తొడ ముందు భాగం) కండరం పట్టేసిందని బీసీసీఐ వైద్యాధికారులు ధృవీకరించారు. గతంలో తొడపిక్క గాయంతో బాధపడిన రాణా, కోలుకునే క్రమంలోనే ఈ కొత్త గాయం బారిన పడటంతో అఫ్గన్ సిరీస్‌తో పాటు ఆసియా గేమ్స్‌కు కూడా పూర్తిగా దూరమయ్యాడుడొమెస్టిక్ క్రికెట్‌లో సయ్యద్ మ-ుస్తాక్ అలీ ట్రోఫీలో కేవలం 7 మ్యాచ్‌ల్లోనే 18 వికెట్లు తీసి అందరి దృష్టిని ఆకర్షించాడు యష్ ఠాకూర్ . ఆపై జింబాబ్వే పర్యటనలో 2 మ్యాచ్‌లు ఆడి 4 వికెట్లు పడగొట్టాడు. డెత్ ఓవర్లలో కచ్చితమైన యార్కర్లు వేయగల సామర్థ్యం ఉన్న యష్ రాకతో భారత పేస్ విభాగం బలంగా మారింది. సెప్టెంబర్ 13 నుంచి ప్రారంభమయ్యే అఫ్గన్ సిరీస్ పూర్తయ్యాక, ఆసియా గేమ్స్‌కు ముందు భారత్ ఒక చారిత్రక మ్యాచ్‌లో జపాన్‌తో కూడా తలపడనుంది.మరోవైపు ఫిట్‌నెస్ నిరూపించుకున్న స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్లు నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్‌లను బీసీసీఐ అప్‌డేటెడ్ స్క్వాడ్‌లోకి అధికారికంగా చేర్చింది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో, తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా భారత జట్టు బరిలోకి దిగుతోంది. సెప్టెంబర్ 13న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో అఫ్గనిస్థాన్‌తో తొలి టీ20 మ్యాచ్ జరగనుంది. ఆ తర్వాత ఆసియా గేమ్స్ జరగనున్నాయి.

# ఆర్చరీలో గోల్డ్ మెడల్ సాధించిన శీతల్ దేవి




భారత పారా ఆర్చర్ శీతల్ దేవీ మరోసారి సత్తా చాటింది. అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్నవరల్డ్ ఆర్చరీ పారా సిరీస్ 2026లో ఆమె స్వర్ణం ముద్దాడింది. కాంపౌండ్ ఈవెంట్‌లో బరిలో దిగిన శీతల్ ఫైనల్?లో కజికిస్థాన్‌కు చెందిన ఐజాదా సీడన్‌తో పోటీపడింది. అయి-ంతే ఇద్దరూ పోటీపోటీగా ఆడడంతో ఫైనల్ ఉత్కంఠభరితంగా సాగింది. ఇందులో ఇరువురు 144-144తో సమంగా నిలిచారు. అనంతరం ఆట షూట్-ఆఫ్‌కు వెళ్లింది. అక్కడ శీతల్ 10 - 9తో తేడాతో విజయం సాధించి పసిడి పతకం పట్టేసింది. కాగా, వరల్డ్ ఆర్చరీ పారా సిరీస్‌లో శీతల్‌కు ఇదే తొలి వ్యక్తిగత స్వర్ణ పతకం.మిక్స్‌డ్ టీమ్ విభాగంలోనూ శీతల్ పతకం ముద్దాడింది. ఆమె తోమన్ కుమార్‌తో కలిసి కాంస్య పతకం సాధించింది. కాంస్య పతక పోరులో ఈ భారత ద్వయం 157-145 తేడాతో ఇరాక్ జోడీ సారా అల్-హమీద్?ను ఓడించింది. ఇక పారా రికర్వ్ మహిళల వ్యక్తిగత విభాగంలో భావన కాంస్యం నెగ్గింది. ఆమె భారత్‌కే చెందిన రాజశ్రీ రాథోడ్‌ను 6- 0 తేడాతో ఓడించి కాంస్య పతకం అందుకుంది.పారా కాంపౌండ్ మహిళల వ్యక్తిగత విభాగంలో సరిత 141- 140 తేడాతో చైనా షూటర్ వాంగ్ హ్యూటింగ్‌పై నెగ్గి కాంస్య పతకం ముద్దాడింది. పారా కాంపౌండ్ పురుషుల వ్యక్తిగత విభాగంలో తోమన్ కుమార్ 143-138 తేడాతో ఇరాక్? పారాఅథ్లెట్ అబ్బాస్ కాధిమ్‌పై నెగ్గి కాంస్య పతకం గెలిచాడు. మరోవైపు, రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్‌లో రెండుసార్లు పారాలింపిక్స్ మెడల్ విన్నర్ హర్విందర్ సింగ్-భావన 6-0 తేడాతో చైనా జోడీ లియాంగ్ కియురోంగ్-షియా లేపై నెగ్గి గోల్డ్ మెడల్ దక్కించుకున్నారు. కాగా, ఈ వరల్డ్ ఆర్చరీ పారా సిరీస్ 2026 స్టేజ్ 3ను భారత్ మొత్తం 15 పతకాలతో ముగించింది. ఇందులో నాలుగు స్వర్ణాలు, మూడు రజతాలు, ఎనిమిది కాంస్యాలు ఉన్నాయి.



# సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన

## స్వగత కృష్ణన్ ఇన్స్టాగ్రామ్ పోస్ట్

తమిళ సినీ పరిశ్రమలో ప్రముఖ గాయని స్వగత కృష్ణన్ చేసిన ఇన్స్టాగ్రామ్ స్టోరీ ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పేరు ప్రస్తావించకుండా ఒక ప్రముఖ సంగీత దర్శకుడిపై ఆమె సంచలన ఆరోపణలు చేశారు. సదరు వ్యక్తి మహిళలపై లైంగిక దాడులు, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ మరియు బలవంతపు మత మార్పిడులకు పాల్పడ్డాడని, అయినా ఇండస్ట్రీ అతని వెంటే నిలవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో ఓ స్టూడియోలో తనకు ఎదురైన లైంగిక వేధింపులు, సౌండ్ ప్రూఫ్ గదిలోని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా బెదిరింపులకు పాల్పడిన ఉదంతాన్ని ఆమె గుర్తుచేశారు. ఈ కారణాల వల్లనే తాను చెన్నై వదిలి రుషీకేష్ వెళ్ళినట్లు తెలిపారు. తీవ్ర ఆరోపణలు ఉన్నప్పటికీ సదరు వ్యక్తికి సినీ పరిశ్రమలో గౌరవం, మద్దతు లభించడంపై ఆమె విచారం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, అతడు ప్రస్తుతం ఒక భక్తిరస చిత్రానికి సంగీతం అందిస్తున్నాడని, బహిరంగ వేదికలపై సన్మానాలు పొందుతున్నాడని పేర్కొంటూ ఇండస్ట్రీ ఎవరి పక్షాన నిలుస్తోందని ప్రశ్నించారు. "నెక్స్ట్.." అంటూ తన పోస్ట్‌ను ముగించడంతో, త్వరలోనే ఆమె మరిన్ని విషయాలను, ఆధారాలను బయటపెట్టబోతున్నారా అనే ఉత్కంఠ నెటిజన్లలో నెలకొంది.

# అతన్ని ప్రేమించిమోసపోయా..

విలక్షణ నటిగా గుర్తింపు తెచ్చుకుని దక్షిణాదిలోని అన్ని భాషల్లో సత్తా చాటుతున్నారు ఐశ్వర్య లక్ష్మీ. నటనే కాదు ఏ విషయంపై అయినా కుండబద్ధలు కొట్టినట్లు మాట్లాడటం ఆమె స్టైల్. ఎవరు ఏమనుకున్నా సరే తన మనసులో ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతారు ఐశ్వర్య. కొద్దిరోజుల క్రితం పెళ్లి, సహజీవనం విషయంలో ఆమె మాట్లాడిన మాటలు హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా రిలేషన్‌పై ఐశ్వర్య చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. కేరళకు చెందిన ఐశ్వర్య లక్ష్మీ.. మెడిసిన్ చదువుకున్నారు. అయితే డాక్టర్ కాకుండా యాక్టింగ్ వైపు వచ్చారు. అప్పటికే మోడలింగ్ చేస్తూ పలు టాప్ బ్రాండ్స్‌కు సంబంధించిన వాణిజ్య ప్రకటనల్లో నటించారు. 2017లో నవిన్ పౌలే సరసన నటించే అవకాశం ఐశ్వర్యకు దక్కింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి గుర్తింపు రావడంతో పాటు మలయాళ, తమిళ భాషల్లో అనూహ్యంగా బిజీ అయ్యారు. మాయానంది, వారాతన్, పొన్నియన్ సెల్వన్, అమ్ము, కుమారి, గట్టా కుస్తీ, హలో మమ్మీ, మామన్ సినిమాలతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. సత్యదేవ్ హీరోగా వచ్చిన గాడ్సే మూవీ ద్వారా తెలుగు వారిని పలకరించారు ఐశ్వర్య లక్ష్మీ. ఈ ఏడాది తమిళంలో గట్టా కుస్తీ 2 సినిమాతో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం సాయిధరమ్ తేజ్ సరసన సంబరాల ఏటి గట్టు, మలయాళంలో ఆశా సినిమాలలో ఆమె నటిస్తున్నారు. సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే ఐశ్వర్య.. తన సినిమాలు, షూటింగ్స్, ఇతర వ్యక్తిగత వివరాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. 35 ఏళ్లు దాటి 40వైపు చేరుకుంటున్నా ఇంకా పెళ్లి చేసుకోకుండా బ్యాచిలర్‌గానే ఎంజాయ్ చేస్తున్నారు ఈ ముద్దుగుమ్మ. పలుమార్లు ఐశ్వర్య లక్ష్మీ ప్రేమలో పడినట్లుగా రూమర్స్ రాగా.. వాటిని ఆమె ఖండించారు. నేను సింగిల్‌గా చాలా హ్యాపీగా ఉన్నాను.. నన్ను డబుల్ చేసేందుకు ప్రయత్నించొద్దని ఫ్యాన్స్‌పై విరుచుకుపడింది ఐశ్వర్య. జీవితంలో నేను పెళ్లి చేసుకోను.. ఎంతోమంది సన్నిహితులను చాలా దగ్గరి నుంచి చూశా. పెళ్లి కారణంగా కలల్ని చంపుకుని, వ్యక్తిగతంగానూ వారు ఎదగలేకపోతున్నారు. ఇవన్నీ చూసి, ఆలోచించి జీవితంలో పెళ్లి చేసుకోకూడదని నిర్ణయించుకున్నాను. సంతోషకరమైన జీవితాన్ని గడపటానికి పెళ్లి అనేది తప్పనిసరి కాదు. పెళ్లి చేసుకుని విడిపోవడం కంటే, సహజీవనం బెస్ట్ అని ఐశ్వర్య లక్ష్మీ బోల్డ్ కామెంట్స్ చేశారు. తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పెళ్లి, ప్రేమపై ఐశ్వర్య లక్ష్మీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నేను గతంలో ఓ రిలేషన్‌లో మోసపోయా, స్వతహాగా నేను ఆకర్షణలకు లొంగను, అలాంటి ఓ వ్యక్తిని పూర్తి నమ్మి అతని చేతిలో మోసపోయా. ఈ రిలేషన్ ముగిసిన తర్వాతే నా చుట్టూ ఏం జరుగుతుందో తెలుస్తోంది. ఓ మహిళ నన్ను కలిసిన తర్వాతే అతని మోసం బయటపడింది. ఇందులో తన తప్పు లేకపోవడం వల్లే ఆమెపై నాకెలాంటి కోపం రాలేదు. ఈ విషయం గురించి రెండు రోజులు మాత్రమే బాధపడ్డా.. ఆ తర్వాత దానిని మరిచిపోయానని ఐశ్వర్య లక్ష్మీ పేర్కొన్నారు.



# 'సీక్రెట్ సోల్జర్' నుంచి సాంగ్ రిలీజ్




నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా తెరకెక్కుతున్న సినిమా 'సీక్రెట్ సోల్జర్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై అక్కి విశ్వనాథ్ రెడ్డి దర్శకత్వంలో స్పై డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతుంది. కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్.. పలువురు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజయిన సాంగ్స్, టీజర్, ట్రైలర్స్ అంచనాలు పెంచగా తాజాగా ఈ సినిమా నుంచి ఓయ్ ఓయ్.. అంటూ సాగే సాంగ్ ని రిలీజ్ చేశారు. కార్తీక్ రోడ్రిగ్జ్ సంగీత దర్శకత్వం అందిస్తూ రెహమాన్ రాసిన ఈ సాంగ్ ని కార్తీక్ స్వయంగా పాడాడు. ఈ సినిమా సెప్టెంబర్ 18న థియేటర్స్ లో రిలీజ్ కానుంది.

# ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ మూవీ మండాడి



సూరి, సుహాస్ మెయిన్ లీడ్స్ గా తెరకెక్కిన తమిళ్ సినిమా 'మండాడి'. ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్ పై ఎల్రెడ్ కుమార్ నిర్మాణంలో మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. ఈ సినిమాలో మహిమా నంబియార్ హీరోయిన్గా నటించగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్.. పలువురు కీలక పాత్రలను పోషించారు. మండాడి సినిమా నేడు సెప్టెంబర్ 10న తమిళ్, తెలుగులో రిలీజ్ అయింది. కళింగపట్నంను సట్టపులి(సుహాస్) రూల్ చేస్తూ ఉంటాడు. ఆ ఊళ్ళో సముద్రంలో జరిగే పడవపోటీలు ఎన్నో ఏళ్లుగా చాలా ఫేమస్. 20 ఏళ్లుగా సట్టపులి సునామి రైడర్స్ టీమ్ తో ఆ ఊరిని గెలిపిస్తూ ఉంటాడు. శ్రీను(రవీంద్ర విజయ్) కొడుకు మల్లేష్(మిథున్ జై శంకర్) పడవల పోటీకి సంబంధించిన ఓ విషయంలో గొడవ జరిగి సట్టపులి కొడుకుపై దాడి చేస్తాడు. అది మిస్ అవ్వడంతో ఓ అమ్మాయి సాయంతో హైదరాబాద్ లో ఉన్న ముత్తు కాళీ(సూరి) దగ్గర తలదాచుకుని ఉంటాడు. ముత్తుకాళీ పెళ్లి చేసుకోకుండా సింగిల్ గా ఉంటూ ఓ స్విమ్మింగ్ పూల్ లో పనిచేస్తూ ఉంటాడు. కానీ సట్టపులి మనుషులు మల్లేష్ ని చంపడానికి అక్కడికి కూడా రావడంతో 20 ఏళ్లుగా ఊరికి వెళ్లని ముత్తుకాళీ మల్లేష్ ని తీసుకొని ఊరికి వస్తాడు. అక్కడ పెద్దలు సట్టపులికి ముత్తుకాళీ మధ్య రాజి కుదర్చాలని ట్రై చేసినా అక్కడ పెద్ద గొడవ అవుతుంది. దాంతో కళింగపట్నం నుంచి రెండు టీమ్స్ పోటీ చేయాలి ఎవరు ఓడిపోతే వాళ్ళు ఆటని వదిలేయాలి అని నిర్ణయిస్తారు. పోటీకి కొన్ని రోజులు సమయం ఉండటంతో కొత్తవాళ్లకు ముత్తుకాళీ తన కళింగ వారియర్స్ టీమ్ గా ట్రైనింగ్ ఇస్తూ ఉంటాడు. సట్టపులి, అతని కొడుకు పోటీ ఎలాగైనా గెలవాలని కుట్రలు పన్నుతూ ఉంటారు. ఓ ప్రాక్టీస్ మ్యాచ్ లో ముత్తుకాళీ టీమ్ పడవ బోల్తా పడి పోటీలో ఉన్నవాళ్లు హాస్పిటల్ పాలవుతారు. దీంతో కళింగ వారియర్స్ కి పోటీల్లో ఎలా పాల్గొనాలో అర్థం కాదు. మరోవైపు 20 ఏళ్ళ క్రితం ముత్తుకాళీ ఒకప్పుడు తన తల్లి ఏంజిల్ (మహిమా నంబియార్)ని ప్రేమించిన వ్యక్తి అని తెలిసి మల్లేష్ ముత్తుకాళీ పై కోపంగా ఉంటాడు. అసలు 20 ఏళ్ళ క్రితం ఆ ఊళ్ళో ఏం జరిగింది? బెస్ట్ ఫ్రెండ్స్ గా ఉండే సట్టపులి -- ముత్తుకాళీ శత్రువులు ఎలా అయ్యారు? ఏంజిల్ -- ముత్తుకాళీ ప్రేమ ఎందుకు విఫలమైంది? పోటీలో గెలవడానికి సట్టపులి చేసే కుట్రలు ఏంటి? ఫైనల్ పోటీలో ముత్తుకాళీ టీమ్ గెలుస్తుందా? సముద్రంలో జరిగే సంఘటనలు ఏంటి.. ఇవన్నీ తెలియాలంటే తెరపై చూడాల్సిందే.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# డాక్టర్ చింతకింది మురహరికి ఘన సన్మానం

**ఆలేరు, సెప్టెంబర్ 10(సమయం న్యూస్):** పారంపర్య వైద్య రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ఆలేరు పట్టణానికి చెందిన డాక్టర్ చింతకింది మురహరికి అరుదైన గౌరవం దక్కింది. ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన పారంపర్య వైద్య మహాసంఘం వైద్య పండిత అవార్డుతో సత్కరించింది. భద్రాచలంలో నిర్వహించిన పారంపర్య వైద్య మహాసంఘం తెలంగాణ రాష్ట్ర రెండో మహాసభలో ఈ అవార్డును ప్రదానం చేశారు. మహాసభలో యోగ గురువు శ్రీశ్రీ శివస్వామి, పారంపర్య వైద్య మహాసభ అధ్యక్షుడు దొంత యాత్రి మహర్షి తదితరుల చేతుల మీదుగా డాక్టర్ చింతకింది మురహరి అవార్డును అందుకున్నారు. అనంతరం నిర్వాహకులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ చింతకింది మురహరి మాట్లాడుతూ పారంపర్య వైద్య విధానాలకు మరింత గుర్తింపు తీసుకురావడంతో పాటు, పూర్వీకుల నుంచి తరతరాలకు అందిన వైద్య విజ్ఞానాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సంప్రదాయ వైద్య పరిజ్ఞానాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో పరిరక్షిస్తూ, ప్రజలకు మరింత ఉపయోగపడేలా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తన సేవలను గుర్తించి వైద్య పండిత అవార్డుతో సత్కరించిన పారంపర్య వైద్య మహాసంఘం రాష్ట్ర నాయకత్వానికి,



యోగ గురువు శ్రీశ్రీ శివస్వామి, దొంత యాత్రి మహర్షి తదితరులకు డాక్టర్ మురహరి కృతజ్ఞతలు తెలిపారు. పారంపర్య వైద్య విధానాల అభివృద్ధి, ప్రోత్సాహానికి వైద్యులు, పరిశోధకులు, వైద్య నిపుణులు, యువత సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. సంప్రదాయ వైద్య విజ్ఞానాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసి సమాజానికి అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పారంపర్య వైద్య రంగానికి చెందిన పలువురు ప్రతినిధులు, వైద్యులు, నిపుణులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతి

### సిర్పంగి స్వామి సిపిఎం మండల కార్యదర్శి.

**వలిగొండ సెప్టెంబర్ 10 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ 1946 ప్రాంతంలో తెలంగాణ ప్రజలను పట్టిపీడిస్తున్న దొరల పీడన,జాగీర్దారుల,పటేల్ పట్వారిల అరాచకాలను,నైజాం రజాకార్ మూకల దోపిడీ దౌర్జన్యాలపై వీరోచితంగా పోరాడి నరహంతకుడు విసునూరు రామచంద్రారెడ్డిని తరిమి కొట్టడంలో కీలకంగా వ్యవహరించిన చిట్యాల ఐలమ్మ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని, ఆమె స్ఫూర్తితో నేటి నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, సీనియర్ నాయకులు కొమ్మిడి లక్ష్మారెడ్డి లు అన్నారు. వలిగొండ మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో చిట్యాల ఐలమ్మ 41 వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి



పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా కిష్టా పురం గ్రామంలో పుట్టిన చాకలి ఐలమ్మ చిన్ననాటి నుండే దొరల దోపిడీదారుల పీడలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేస్తూ ఆంధ్ర మహాసభ సభ్యురాలుగా చేరి విసునూరు రామచంద్రారెడ్డి దోపిడీ దౌర్జన్యాలు,వెట్టి చాకిరి విముక్తి,భూమి,భుక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వన పోరాడిందన్నారు అతి క్రూరుడుగా ఉన్న విసునూరు రామచంద్రారెడ్డి ఆనాడు ప్రజలపై విపరీతమైన పనులు వేస్తూ సిస్తులు వసూలు చేస్తూ ప్రజల్ని దోచుకోవడం కాకుండా ఆడవారిపై దౌర్జన్యాలు, చేయడానికి చూసి చాకలి ఐలమ్మ సహించలేకపోయిందని గ్రామ గ్రామాన తిరుగుతూ ప్రజలను చైతన్యం చేస్తూ ఆంధ్ర మహాసభలో సభ్యులుగా చేర్చి దొరలపై తిరుగుబాటు చేసిన వీర వనిత అన్నారు. ఆమె స్ఫూర్తితో తెలంగాణ పల్లెల్లో అనేక గ్రామాలు దొరలపై తిరుగుబాటు చేశాయని దోపిడీ, పీడనలను ఈ పోరాటం ద్వారా విముక్తి జరిగిందన్నారు ఐలమ్మ పోరాటాన్ని పోరాడిన విధానాన్ని మరుగున పరిచేందుకు ఆమెను ఒక కులానికి పరిమితం చేసే కుట్రలను పాలకవర్గాలు చేస్తున్నాయని ఆమె పోరాట వారసత్వాన్ని ప్రజలకు వివరించాలని నేడు దేశాన్ని ఏలుతూ ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తూ,భారత రాజ్యాంగాన్ని, మార్చేందుకు, వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరిస్తున్న నయా ఉదారవాద బిజెపి పాలనపై ప్రజలు ఆమె స్ఫూర్తితో తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు కూర శ్రీనివాస్,వాకిటి వెంకటరెడ్డి, కందడి సత్తిరెడ్డి,మండల కమిటీ సభ్యులు కలుకూరి రామచందర్,బూడిద మనమ్మ,సీనియర్ నాయకులు కొండూరు సత్తయ్య, దయ్యాల మల్లేశం,డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు ద్యానబోయిన యాదగిరి, కొమ్మ స్వామి,ఐద్వా మండల అధ్యక్షులు కర్నాటి మత్స్యరాణి,పోలేపల్లి హమీద,జహంగీర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# వీర వనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి స్ఫూర్తిదాయకం

### జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జ్యోతి

**ఖమ్మం, సెప్టెంబర్ 10 : ( సమయం న్యూస్ )** వీర వనిత చాకలి ఐలమ్మ ప్రదర్శించిన పోరాట స్ఫూర్తి స్ఫూర్తిదాయకమని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ణి జి. జ్యోతి అన్నారు. స్థానిక వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద గురువారం జిల్లా వెనక బడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ణి పాల్గొని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ సమాజంలోని అసమానత్వానికి ఎదురొడ్డి నిర్భయంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని, జమీందార్ల పాలనలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా అనేక సంఘాలలో ఆమె స్ఫూర్తి నింపారని అన్నారు. చాకలి ఐలమ్మ సంఘ సేవకురాలిగా, భూ, సాయుధ రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాట పటిమతో వీర వనితగా చరిత్రలో నిలిచి, ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ సొసైటీ చైర్మన్ ఎలగొండ స్వామి, రజక కులసంఘ నాయకులు, బిసి కుల సంఘ నాయకులు జక్కుల వెంకటరమణ, తమ్మరపు బ్రహ్మం, మాచర్ల యెలాద్రి, కోడి లింగయ్య, నట్టు వెంకటేశ్వర్లు, కత్తి నెహ్రూగౌడ్, మునిగ కోటేశ్వరరావు, ఎల్లురి విజయ్ కుమార్, ఎస్ కే సయ్యద్ బాషా, వల్లపు సోమరాజు, అప్పారావు, ఉపేందర్, పడిగల కృష్ణవేణి,



రమాదేవి, బాబురావు, సత్యనారాయణ, హనుమంతు రావు, వెంకన్న, రమణ కుమార్, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారులు, ఖమ్మం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయం సిబ్బంది, వసతిగృహ సంక్షేమ అధికారులు, రజక సంఘ నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యను ఆయుధంగా చేసుకొని లక్ష్యాలను సాధించాలి

- **జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS**
- **.ఉద్యోగ సాధనకు పట్టు దలతో కృషి చేయాలి.**

**నారాయణపేట, సెప్టెంబర్, 10 (సమయం న్యూస్)** విద్యను ఆయుధంగా చేసుకుని అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు పట్టుదలతో నిరంతర కృషి చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ సూచించారు..నారాయణపేట జిల్లా కేంద్రంలోని శిలా గార్డెన్స్‌లో ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్ (OMIF) ఆధ్వర్యంలో జోగినిల పిల్లలు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, నిరుపేద మహిళలు, హెల్త్ వర్కర్లకు ఉద్యోగ సాధన, విద్య మరియు ఉపాధి అవకాశాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ IPS ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సంద ర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... విద్య ఒక్క వ్యక్తి జీవితాన్నే కాకుండా మొత్తం కుటుంబం భవిష్యత్తును మార్చగలిగే శక్తి వంతమైన సాధనమని తెలిపారు. విద్యా ర్థులు, యువత తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకొని వాటిని సాధించే దిశగా క్రమశిక్షణతో, పట్టుదలతో కష్టపడాలని సూచించారు. చదువుపై ఆసక్తి, ఉద్యోగం సాధించాలనే బలమైన ఆకాంక్ష, నిరంతర శ్రమ ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని చెప్పారు. ఉద్యోగ సాధనలో "ఆకలి" ఉండాలని ఎస్పీ సూచించారు. మనకు ఆకలిగా ఉన్నప్పుడు ఆహారం కోసం ఎంతగా ప్రయత్నిస్తామో, అదే విధంగా ఉద్యోగం సాధించాలనే తపన, లక్ష్యాన్ని చేరుకోవాలనే ఆకలి మనలో బలంగా ఉన్నప్పుడే దాని



కోసం కష్టపడి పనిచేయగలుగుతామని వివరిం చారు. కష్టాలు, వైఫల్యాలు ఎదురైనప్పుడు నిరుత్సాహపడకుండా వాటిని అనుభవాలుగా తీసుకొని మరింత పట్టుద లతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ సానుకూల దృక్పథంతో (Positive Thinking) ఉండాలని ఎస్పీ తెలిపారు. “నేను సాధించగలను” అనే నమ్మకం మనలో బలంగా ఉన్నప్పుడు, ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి అవసరమైన కృషి చేయగలుగుతామని అన్నారు. ఉద్యోగం కోసం సిద్ధమవుతున్న యువత సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదువుతూ,అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకో వాలని సూచించారు.ప్రస్తుతం పోలీస్ శాఖలో ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో నారాయణపేట జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతకు సహకరించేందుకు త్వరలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ వెల్లడించారు. పోలీస్ ఉద్యోగాలతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు అవసరమైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్ తదితరాలను ఉచితంగా అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడతామని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి తమ కుటుంబాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మహిళలు విద్యను ఆయుధంగా చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఒక మహిళ చదు వుకుంటే ఆ కుటుంబం మొత్తం చదు వుకుంటుందని, మహిళల విద్యతో కుటుంబంలో విద్యాపట్ల అవగాహన పెరి గి, పిల్లల భవిష్యత్తు మరింత మెరుగు పడుతుందని తెలిపారు. నిరుపేద మహి ళలు, యువతులు తమకు అందు బాటులో ఉన్న విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను వినియోగించుకొని ఆర్థికంగా స్వావలం బన సాధించాలని సూచించారు. అదేవిధంగా, విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, మంచి ఆలోచనా విధానం, సామాజిక బాధ్యత వంటి విలువలను అలవర్చుకోవాలని ఎస్పీ సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ తమ సమయాన్ని చదువు, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ సాధనకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, నిరుద్యోగ యువత, మహిళలు మరియు ఇతర లబ్ధిదారులకు ఉద్యోగ సాధనకు సంబంధించిన అవకాశాలు, అవసరమైన నైపుణ్యాలు, భవిష్యత్తు ప్రణాళికపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు మహేష్, నల్లపు లింగయ్య, టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎస్‌బీ ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి, ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్ మేనేజర్ ఏంజెలా డేవిస్, జిల్లా కోఆర్డినేటర్ ఆజమ్మ, హెల్త్ వర్కర్లు, విద్యార్థులు, మహిళలు, యువత మరియు ఇతరులు పాల్గొన్నారు.

# పుట్టు క నీది చావు నీది బతకంతా దేశానిది

### కాలోజి నారాయణరావు

- **టీ. వి.వి.రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్**



**దుద్యాల మండలం, సెప్టె ంబర్,10(సమయం న్యూస్)** కాళోజి గారి జీవితం యావత్ యువతకు ఆదర్శమని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి తెలియజేశారు ఈరోజు నా గొడవనే ప్రజల గొడవ అని మరియు స్వాతంత్రోద్యమంలో తెలంగాణ ఉద్యమంలో ఆంధ్ర మహాసభ ఉద్యమంలో పాల్గొని తెలంగాణ యాస భాష పై అలుపెరుగని పోరాటం చేసి తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసిన వారు ప్రాంతేతరులు అయితే ప్రాంత పొలిమేలు దాటి తరిమికొడతామని ప్రాంతం వాడైతే ప్రాంతం నడిబొడ్డున ప్రాణాలు తీస్తాం అని మరియు తెలంగాణ వ్యతిరేకులు ఎవడైనా ద్వేషిస్తానని మరియు తెలంగాణ రాష్ట్రానికి అనుకూలం అయినా శత్రువుని కూడా కౌగిలించుకుంటానని తెలియజేసిన గొప్ప వైతాళికుడు కాళోజి అందుకే కాలేజీ ప్రజా కవి మన కవి కావున కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణం ద్వారా గౌరవించి రాష్ట్ర ప్రభుత్వం కాళోజి జన్మదినాన్ని తెలుగు భాషా దినోత్సవం గా ప్రకటించి కాళోజీ పైన ఉన్న గౌరవాన్ని చాటి చెప్పాయి కాలేజీ నిజాం రాజును సైతం తన కలము పోటుతో వ్యతిరేకించిన గొప్ప వ్యక్తి కాళోజీ అని మరియు ఈయన రాసిన నా గొడవ సమకాలీన సమస్యలపై తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక అంశాలను ప్రస్తావించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తన గొడవకు ముగింపు అని మరియు అన్ని వర్గాలు సమానంగా ఆర్థికంగా సామాజికంగా ఎదిగిన నాడే నా గొడవ ముగింపు అని చాటిచెప్పిన గొప్ప వ్యక్తి గొప్పవైతాళికుడు మన ప్రజాకవి కాలోజాన్ని వివరించారు.

# బహదూర్ పేటను తిరిగి గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి

### అసెంబ్లీ లో సమస్యను ప్రస్తావించాలి: మాజీ వార్డు సభ్యుడు దంతుల ఎల్లేష్

**ఆలేరు, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):** ఆలేరు మున్సిపాలిటీలో విలీనమైన ఆరో వార్డు బహదూర్ పేటను తిరిగి గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామ మాజీ వార్డు సభ్యుడు దంతుల ఎల్లేష్ డిమాండ్ చేశారు. గత ఎమ్మెల్యే ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల సమయంలో బహదూర్‌పేటను తిరిగి గ్రామపంచాయతీగా ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. ఈ



సందర్భంగా గురువారం ఆలేరు పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో బహదూర్‌పేట సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం బహదూర్‌పేటను తిరిగి గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసే అంశంపై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతోపాటు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు. బహదూర్ పేట గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో స్థానికంగా చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజలకు స్పష్టంగా కనిపించేవని ఎల్లేష్ పేర్కొన్నారు. మున్సిపాలిటీలో విలీనం చేసిన తర్వాత గ్రామానికి ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదని అన్నారు. స్థా నిక అవసరాలు, ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని పరిపాలనా సౌలభ్యం కోసం బహదూర్‌పేటను ప్రత్యేక గ్రామపంచాయతీగా పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో స్థానిక ప్రజలకు అందుబాటులో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) వంటి ఉపాధి అవకాశాలు ప్రస్తుతం తగ్గిపోయాయని తెలిపారు. దీంతో గ్రామీణ కూలీలు, నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బహదూర్‌పేట ప్రజల ఆకాంక్షను గౌరవించి గ్రామపంచాయతీగా పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నిలబెట్టుకోవాలని దంతుల ఎల్లేష్ కోరారు.

# కేసీఆర్ చావును కోరిన విర్లపల్లి శంకర్ పై కఠిన చర్యలు



**రాయపోల్ సెప్టెంబర్ 10.** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆద్వర్యంలో నిరసన చేపట్టా రు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకులు ఇప్ప దయాకర్ అధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహాన్నికి వినతి పత్రం అందజేశారు.ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్సై మానస కు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ఎన్నో ఉద్యమాలు చేసి అని వర్గల ప్రజలను ఏకం చేసి శాంతియుతంగా పోరాటాలు చేసి డిల్లీ మెడల్ వంచి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ ను చావును కోరడం ఎమ్మెల్యే కు విర్లపల్లి శంకర్ తగదని.కేసీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన శంకర్ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ హనుమంతు రాజు. మాజీ అహ్మదిపూర్ రాజ గౌడ్.మంతూర్ సర్పంచ్ పర్వేజ్ అహ్మద్.ఉప సర్పంచ్ బందరం సంతోష్.మండల బీఆర్ఎస్ యువజన అధ్యక్షులు గల్వ దయాకర్ రెడ్డి. నాయకులు మాదాసు నవీన్. చింతకింది మంజూర్. మహేష్.రాంపల్లి సతీష్.అశోక్.బాల కృష్ణ. కొంగరి శ్రీకాంత్. నాంసాని స్వామి. సందీప్. తదితరులు పాల్గొన్నారు.

## తాళ్ల పల్లి లో ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి




**(షాబాద్), సెప్టెంబర్ 10: (సమయం న్యూస్)** షాబాద్ మండలం తాళ్లపల్లి గ్రామంలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాళ్ల స్వాతి మాణిక్యం గౌడ్, రజక సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## వాహనం అమ్మారా.. యాజమాన్య బదిలీ తప్పనిసరి!

- ఆర్టీ ఏ రికార్డుల్లో పేరు మారకపోతే చట్ట పరమైన చర్యలు
- మహబూబాబాద్ జిల్లా రవాణా అధికారి శంకర్ నాయక్



**మహబూబాబాద్, సెప్టెంబరు 10 (సమయం న్యూస్) :** వాహనాలను విక్రయించే యజమానులు అప్రమత్తంగా ఉండాలని, విక్రయం అనంతరం ఆర్టీఏ రికార్డుల్లో యాజమాన్య బదిలీ తప్పనిసరిగా పూర్తి చేయించాలని జిల్లా రవాణా అధికారి శంకర్ నాయక్ సూచించారు. కేవలం తెల్లకాగితంపై అగ్రిమెంట్ చేసుకోవడం లేదా వాహనం డబ్బులు తీసుకోవడం ద్వారా బాధ్యత పూర్తయినట్లు భావించవద్దని తెలిపారు. ఇటీవల గౌతమ్ అనే వ్యక్తి ఫైనాన్స్ ద్వారా ఆటోను కొనుగోలు చేశాడు. కొంతకాలానికి ఈఎంఐలు చెల్లించలేక మరో వ్యక్తికి ఆటోను విక్రయించాడు. అయితే విక్రయ సమయంలో తెల్లకాగితంపై అగ్రిమెంట్ మాత్రమే చేసుకున్నారు. ఆర్టీఏ రికార్డుల్లో మాత్రం వాహనం గౌతమ్ పేరుమీదే కొనసాగింది. కొంతకాలానికి అదే ఆటోలో గంజాయి తరలిస్తుండగా భద్రాచలం వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఆర్టీఏ రికార్డుల ప్రకారం వాహనం యజమానిగా గౌతమ్ పేరు ఉండటంతో పోలీసు కేసు కారణంగా ఆయన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. వాహనం ఫైనాన్స్‌లో ఉండటంతో పెండింగ్ ఈఎంఐలను చెల్లించాలంటూ ఫైనాన్స్ సంస్థ నుంచి కూడా ఒత్తిడి ఎదురైంది. ఈ ఘటన వాహన యజమానులకు గుణపాఠమని శంకర్ నాయక్ పేర్కొన్నారు. వాహనం విక్రయించిన తర్వాత కొనుగోలుదారుడి పేరుమీద యాజమాన్య బదిలీ పూర్తయిందా లేదా అన్నది విక్రేత స్వయంగా నిర్ధా రించుకోవాలని సూచించారు. వాహనం కొత్త యజమాని ప్రమాదానికి గురిచేసినా, నిబంధనలకు విరుద్ధంగా వినియోగించినా లేదా ఏదైనా చట్టపరమైన వ్యవహారంలో చిక్కుకున్నా.. ఆర్టీఏ రికార్డుల్లో పాత యజమాని పేరే ఉంటే అతనికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు.

### వాహనం విక్రయిస్తే ఇవి తప్పనిసరి...

వాహనం విక్రయించినప్పుడు కేవలం అగ్రిమెంట్ చేసుకోవడం, డబ్బులు తీసుకోవడంతో సరిపెట్టుకోవద్దని రవాణా శాఖ అధికారి సూచించారు. సంబంధిత ఆర్టీఏ కార్యాలయంలో యాజమాన్య బదిలీ ప్రక్రియను పూర్తి చేయించి, రికార్డుల్లో కొత్త యజమాని పేరు నమోదైనట్లు నిర్ధా రించుకున్న తర్వాతే విక్రయ ప్రక్రియ పూర్తయినట్లు భావించాలని కోరారు. వాహనం అమ్మకం కాగితాలపై కాదు, ఆర్టీఏ రికార్డుల్లోనూ పేరు మారితేనే బాధ్యత నుంచి విముక్తి అనే విషయాన్ని యజమానులు గుర్తుంచుకోవాలని శంకర్ నాయక్ సూచించారు.

## నర్కూడ ఇందిరమ్మ కాలనీ అభివృద్ధి కి చర్యలు

- సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్
- జీపీ నిధులతో ఇందిరమ్మ కాలనీలో బోరు



**శంషాబాద్ సెప్టెంబర్ 10:** ఇందిరమ్మ కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని నర్కూడ గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ అన్నారు. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు గురువారం గ్రామపంచాయతీ నిధుల ( జీపి)తో కాలనీలో మంచినీటి బోరు వేయించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ నీరటి మహేష్ ముదిరాజ్ కలిసి ఆయన మాట్లాడారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు 60 చదరపు గజాల చొప్పున ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు ఇచ్చిందన్నారు. కాలనీ అభివృద్ధి కి చర్యలు తీసుకోవాలని మంచినీరు , విద్యుత్ సౌకర్యం కల్పించాలని కాలనీ ప్రజలు తమకు విజ్ఞప్తి చేశారని తెలిపారు. దీంతో ప్రజల అవసరాల మేరకు కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్ణయించామన్నారు. ఇందులో భాగంగానే కాలనీలో నీటి సమస్య పరిష్కారం కోసం బోర్ వేయించడం జరిగిందని తెలిపారు. గతంలో కాలనీకి రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయంపై సదరు వ్యక్తులతో మాట్లాడి 30 ఫీట్ల రోడ్డు విడిపించడం జరిగిందన్నారు. రోడ్డు ఏర్పాటు కారణంగా శంషాబాద్ ప్రాంతానికి సులభమైన రాకపోకలకు అవకాశం ఏర్పడిందన్నారు. త్వరలోనే కాలనీలో విద్యుత్ సమస్య పరిష్కారం చేసి దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేస్తామన్నారు. కాలనీ ప్రజలు మాట్లాడుతూ కాలనీలో బోరు వేయించినందుకు సంతోషం వ్యక్తం చేస్తు సర్పంచ్ కు పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె. రంజిత్ కుమార్ , వార్డు సభ్యులు కనకమామిడి విష్ణు ముదిరాజ్, పర్వతం వినోద్ కుమార్, చౌట రాజు, బూరుకుంట నాగరాజు, పర్వతం వెంకటయ్య నాయకులు తొంట అశోక్, గూడెపు వెంకట్ లక్ష్మణ్ రావు, బి. దేవేందర్ , పర్వతం జగన్, కర్నాల్ శ్రీనివాస్, గుండాల విష్ణు, కుమ్మరి మహేష్ బాబు, కుమ్మరి భాస్కర్, వీఆర్ఏ నీరటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎ ఐ కె ఎం ఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా మామిడాల భిక్షపతి

- రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బేజాడి కుమార్ 31 మందితో నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**ఆలేరు, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):** అఖిల భారత రైతు–కూలీ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన మామిడాల భిక్షపతి ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామానికి చెందిన బేజాడి కుమార్ ఎన్నికయ్యారు. మంచిర్యాల పట్టణంలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించిన ఎ ఐ కె ఎం ఎస్ తెలంగాణ రాష్ట్ర 9వ మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. 31 మందితో కూడిన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో మహాసభలు విజయవంతంగా ముగిశాయి.





### 45 ఏళ్లు గా రైతాంగ ఉద్యమంలో

ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన మామిడాల భిక్షపతి గత 45 ఏళ్లుగా ప్రజా, రైతాంగ ఉద్యమాల్లో చురుకుగా పనిచేస్తున్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిర్వహించిన అనేక పోరాటాల్లో ఆయన కీలకంగా పాల్గొన్నారు. రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాడుతూ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో క్రియాశీలక పాత్ర పోషించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయన వరుసగా రెండోసారి ఎన్నిక కావడం విశేషం.

### విద్యార్థి ఉద్యమాల నుంచి..

యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామానికి చెందిన బేజాడి కుమార్ విద్యార్థి, యువజన ఉద్యమాల ద్వారా తన ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించారు. విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై పలు పోరాటాల్లో పాల్గొన్నారు. అనంతరం రైతాంగ, ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఆయన ఎన్నికయ్యారు.

### జిల్లా ఉద్యమ శ్రేణుల అభినందనలు

మామిడాల భిక్షపతి, బేజాడి కుమార్‌లు రాష్ట్ర స్థాయి బాధ్యతలకు ఎన్నిక కావడంపై యాదాద్రి భువనగిరి జిల్లా రైతాంగ, ప్రజా ఉద్యమ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. వారికి విప్లవాభినందనలు తెలిపాయి. రైతులు, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం మరింత విస్తృతమైన పోరాటాలను నిర్మించాలని, ఎ ఐ కె ఎం ఎస్ ను రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- తక్కువ వర్షపాతంతో ప్రత్యామ్నాయ నీటి వసతులపై దృష్టి.. మండపాలకు ఉచిత విద్యుత్తు
- చెరువుల్లో ముందస్తుగా నిమజ్జన పాండ్లు.. పారిశుద్ధ్యంపై నిరంతర పర్యవేక్షణ
- అధికారులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కీలక సూచనలు

**హనుమకొండ, సెప్టెంబరు 10 (సమయం న్యూస్) :** వినాయక చవితి, నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు. తక్కువ వర్షపాతం కారణంగా నగరంలోని చెరువులు, ఇతర నీటి వనరుల్లో నీటి లభ్యత తగ్గిన నేపథ్యంలో నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని మినీ హాల్‌లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే నాయిని పాల్గొన్నారు. నిమజ్జన ఏర్పాట్లు, నీటి వసతి, పారిశుద్ధ్యం, విద్యుత్తు, ట్రాఫిక్, పోలీస్ బందోబస్తు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.

### ముందస్తుగా నిమజ్జన పాండ్లు...

ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదైనందున నిమజ్జనానికి అనువైన చెరువులు, నీటి వనరులను ముందుగానే గుర్తించాలని నాయిని సూచించారు. నీటిమట్టం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో అవసరమైన నీటిని నిల్వ చేసే ఏర్పాట్లు చేపట్టాలని, తగినచోట్ల నిమజ్జన పాండ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. భారీ విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్లు, ఇతర పరికరాలను ముందుగానే సిద్ధంగా ఉంచి ప్రమాదాలకు తావులేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బంధం చెరువులో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. నిమజ్జనానికి ముందే చెరువు పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్ది అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. చెరువుల అభివృద్ధిని కేవలం వినాయక నిమజ్జనానికే పరిమితం చేయకుండా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలని చెప్పారు. రానున్న బతుకమ్మ వేడుకలను దృష్టిలో ఉంచుకుని కూడా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

### మండపాలకు ఉచిత విద్యుత్తు...

నగరంలో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు ఉచిత విద్యుత్తు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. మండపాల్లో విద్యుత్తు కనెక్షన్లు , వైరింగ్‌ను అధికారులు ముందుగానే పరిశీలించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈసారి మండపాల సంఖ్య



పెరిగే అవకాశం ఉన్నందున వాటి వివరాలను ముందుగానే సేకరించి శాఖల మధ్య సమన్వయం పెంచుకోవాలని అన్నారు.

### పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి...

మండపాల పరిసరాల్లో ప్రతిరోజూ మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షణ ఉండేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని నాయిని సూచించారు. చెత్త తొలగింపు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని తెలిపారు.

### నిబంధనలు పాటించేలా అవగాహన...

మండపాల సమీపంలో ఆలయాలు, పాఠశాలలు, చర్చిలు, మసీదులు వంటి మతపరమైన, విద్యాసంస్థలు ఉన్నచోట నిర్వాహకులకు ముందుగానే అవగాహన కల్పించాలని సూచించారు. శబ్ద వ్యవస్థ వినియోగంలో నిబంధనలు పాటిస్తూ ఇతరులకు ఇబ్బంది కలగకుండా వేడుకలు నిర్వహించేలా అధికారులు సమన్వయం చేసుకోవాలని చెప్పారు.

### ట్రాఫిక్, వైద్య సేవలు అందుబాటులో ఉండాలి...

వినాయక చవితి నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీస్, ట్రాఫిక్, జీడబ్ల్యూఎంసీ, విద్యుత్తు, ఆరోగ్య, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని నాయిని సూచించారు. ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందుగానే రూట్‌మ్యాప్ సిద్ధం చేసి, అవసరమైనచోట్ల ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా వైద్య సిబ్బంది, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని, నిమజ్జన మార్గాల్లో ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. చివరి నిమిషంలో ఏర్పాట్లు చేయకుండా ముందుగానే కార్యాచరణ రూపొందించి, గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని శాశ్వత పరిష్కారాల దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు హితవు పలికారు. సమావేశంలో ఈవీ శ్రీనివాస్‌రావు, మాజీ కార్పొరేటర్ అబూబకర్, అదనపు కలెక్టర్ రవి, జీడబ్ల్యూఎంసీ, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా పోరాటానికి ధైర్యదీపిక.. చాకలి ఐలమ్మ

- ఆత్మగౌరవ పోరాటానికి నిలువెత్తు ప్రతీక
- ఐలమ్మ స్ఫూర్తితో అన్యాయాన్ని ప్రశ్నించాలి... డా.గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

**నర్సంపేట/వరంగల్, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్) :** అణచివేత, దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ జీవితం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాణా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సామాన్య మహిళగా జీవితం ప్రారంభించిన ఐలమ్మ



అసామాన్య ధైర్యసాహసాలతో ప్రజా పోరాటానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. నాటి భూస్వామ్య వ్యవస్థలో పేదలపై సాగిన దోపిడీ, అణచివేత, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ఆమె ధైర్యంగా గళమెత్తారని తెలిపారు. తన హక్కు కోసం మాత్రమే కాకుండా అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం ఐలమ్మ పోరాడారని పేర్కొన్నారు. ఎన్ని ఒత్తిళ్లు, బెదిరింపులు, కష్టాలు ఎదురైనా న్యాయం కోసం ఆమె వెనుకడుగు వేయలేదన్నారు. ఐలమ్మ పోరాటం వ్యక్తిగత సమస్యకు పరిమితం కాలేదని, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, హక్కుల కోసం సాగిన ప్రజా పోరాటానికి ప్రతీకగా నిలిచిందని చెప్పారు. మహిళలు సైతం సామాజిక మార్పులో కీలక పాత్ర పోషించగలరని తన కార్యాచరణతో నిరూపించిన స్ఫూర్తిదాయక మహిళ ఐలమ్మ అని అన్నారు. నేటి యువత ఐలమ్మ జీవితాన్ని, ధైర్యాన్ని, పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అన్యాయం ఎక్కడ కనిపించినా ప్రశ్నించడం, హక్కుల కోసం నిలబడటం, సమాజ శ్రేయస్సు కోసం పనిచేయడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఐలమ్మ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనిస్తూ సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఫ్లో ర్ లీడర్, కౌన్సిలర్ జూలూరు రోజారాణి, నర్సంపేట పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, రూరల్ అధ్యక్షుడు తనుగుల అంబేద్కర్, నియోజకవర్గ నాయకుడు జూలూరు మనీష్‌గౌడ్, జిల్లా కిసాన్ మోర్చా నాయకులు శీలం సత్యనారాయణ, బచ్చు వెంకన్న, సీనియర్ నాయకుడు కుంభం కోమల్‌రెడ్డి, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి రాము, పట్టణ నాయకులు ఠాకూర్ విజయ్‌సింగ్, కాసుల నాగేంద్రబాబు, పొనుగోటి రవీంద్రచారి, గుంటి అరవింద్, అనిల్, గణేష్, రాజు తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉమ్మడి మండల రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధ ంతి వేడుకలు

**కోటగిరి, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్ ):** తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ త్యాగం, పోరాట స్ఫూర్తి తరతరాలకూ ఆదర్శనీయమని ఉమ్మడి మండల రజక సంఘం అధ్యక్షులు ప్యాట్ల పెంటయ్య పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్యాట్ల పెంటయ్య మాట్లాడుతూ... భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం దొరల గడీలను ఎదురించి పోరాడిన వీరనారి ఐలమ్మ అని కొనియాడారు. ఆమె పోరాట పటిమ తెలంగాణ సాయుధ పోరాటానికి ఊపిరిపోసిందన్నారు. రజక సంఘం హక్కుల సాధనకు, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా ము ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండల రజక సంఘ నాయకులు గజేందర్, బాలయ్య సాయిబాబా, కాశీరామ్, రాజు తదితరులు పాల్గొన్నారు.